మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి **ఈవార్తలు** దినపత్రిక

NETI EVARTHALU

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 7-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 158 Issue: 158

07 డిసెంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:37 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః తదియ సా. 6:31 వరకు తరువాత చవితి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పునర్వసు తె. 4:11ం వరకు తరువాత పుష్యమి యోగం శుక్ల రా. 8:04 వరకు కరణం వనిజ ఉ. 7:52 వరకు విష్టి సా. 6:31 వరకు వర్జ్యం సా. 5:12 నుండి సా. 6:40 వరకు దుర్ముహూర్తం సా. 4:09 నుండి సా. 4:53 వరకు రాహుకాలం సా. 4:15 నుండి సా. 5:37 వరకు యమగండం మ. 12:07 నుండి మ. 1:30 వరకు గుళికాకాలం మ. 2:52 నుండి సా. 4:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:01 నుండి తె. 5:49 వరకు అమృత ఘడియలు రా. 1:59 నుండి తె. 3:27 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:29 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున


Published from Jagitial
www.evarthalu.com


ఆలోచించే దిశగా కంప్యూటర్లు..

# రోబోకూ.. మనసుంది!



## భావోద్వేగాలు తెలుస్తున్నాయ్
## తర్కం తెలుసుకుంటున్నాయ్
## సింథటిక్ ఇంటెలిజెన్స్ ఎంట్రీ
## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఖతం
## మానవాళికి పెను సవాల్



రోబో సినిమాలో హీరో ఒక రోబోను సృష్టిస్తాడు. ఆ రోబో కేవలం తనకు చెప్పిన పనినే చేసేది. అది కూడా దాని పరిధుల్లో, దానికి అమర్చిన ప్రోగ్రామింగ్ వరకే. కానీ, దానికి భావోద్వేగాలు తెలిసేలా చేస్తాడు హీరో. అప్పటి నుంచి అది మనుషుల్లా ఆలోచించడం మొదలుపెడుతుంది. అప్పుడే విలన్ చేతిలోకి చిక్కుతుంది. దాంతో ఆ రోబోనే విలన్ అవుతుంది. హీరోయిన్‌ను పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. మనుషుల అంతానికి ప్లాన్ చేస్తుంది. ఇదంతా సైన్స్ ఫిక్షన్. సినిమా వరకే దాని పరిధి. కానీ.. దాన్ని నిజం చేసే రోజులు రాబోతున్నాయి. అవునండీ బాబూ..! రోబో మనిషిలా ఆలోచించబోతోంది. ఎదుటి వాళ్ల ఇంటెన్షన్ ఏంటి? వాళ్ల భావోద్వేగాలు ఏంటి? తెలుసుకొని వాళ్ల ప్రవర్తనను బట్టి నడుచుకోబోతోంది. అంటే.. నిజ జీవితంలో రోబో సినిమాను చూడబోతున్నామన్న మాట. దీన్నే మనం సింథటిక్ ఇంటెలిజెన్స్ (ఎస్ఐ)గా పిలుస్తున్నాం.

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)


సండే స్పెషల్ స్టోరీ (Sunday Special Story)

ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో ఉన్నాం. మన ఫోన్లలోని వాయిస్ అసిస్టెన్స్ నుంచి ఆటోమెటిక్ కార్ల వరకు ప్రతిచోటా ఏఐ కనిపిస్తోంది. అయితే, పరిశోధకులు ఇప్పుడు తదుపరి దశ గురించి మాట్లాడుతున్నారు. అదే సింథటిక్ ఇంటెలిజెన్స్ (ఎస్ఐ). సాధారణ ప్రజలకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, సింథటిక్ ఇంటెలిజెన్స్ అంటే కంప్యూటర్లు, యంత్రాలు కేవలం 'అనుకరించడం' కాకుండా, నిజంగా 'ఆలోచించే' సామర్థ్యాన్ని సృష్టించడం. వాస్తవానికి ఏఐ, ముందుగా ప్రోగ్రాం చేసిన అల్గారిథమ్స్‌ను బట్టి పనిచేస్తాయి. మనకు ఆలోచనలా అనిపించినా, డేటా విశ్లేషణ, నమూనాల గుర్తింపు ఆధారంగానే జరుగుతుంది. ఫలితం అందిస్తుంది. అంటే.. ఏఐకి నిజమైన స్పృహ లేదా స్వీయ అవగాహన ఉండదు. సింపుల్‌గా చెప్పాలంటే.. దానికి మనసు ఉండదు. అయితే, సింథటిక్ ఇంటెలిజెన్స్ కార్యరూపం దాల్చితే, అది మన సమాజాన్ని, జీవితాలను సమూలంగా మార్చేస్తుంది. ప్రస్తుతం ఉన్న డ్రైవర్‌లెస్ కార్లు కేవలం ప్రోగ్రామ్ చేయబడిన మార్గాల్లోనే వెళ్తాయి. కానీ ఎస్ఐ కార్లు మానవ డ్రైవర్ల మాదిరిగానే ఊహించని పరిస్థితులకు (ఉదాహరణకు, రోడ్డుపై ఆకస్మికంగా అడ్డంగా వచ్చిన అడ్డంకులకు) నిజమైన తెలివితేటలతో, తక్షణ నిర్ణయాలు తీసుకుంటాయి. ప్రస్తుతం ఉన్న సిరి లేదా తరువాయి 2 వ పేజీలో...

## ఏఐ “ ఎస్ఐ

ఇది మానవ మేధస్సును ప్రతిబింబిస్తుంది లేదా అనుకరిస్తుంది. మనం ఇచ్చిన డేటా ఆధారంగా ఇది పనిచేస్తుంది. ఉదాహరణకు, మనం పిల్లి బొమ్మలు చాలా చూపిస్తే, ఏఐ ఆ బొమ్మ ఏంటో గుర్తించడం నేర్చుకుంటుంది. అది ఒక నైపుణ్యాన్ని సాధిస్తుంది, కానీ దానికి నిజంగా పిల్లి అంటే ఏంటో తెలియదు.

(ఏఐ అనేది ఒక స్మార్ట్ టూల్)



ఇది కేవలం అనుకరణ కాదు. వివిధ ప్రాథమిక మేధో భాగాలను (ఉదాహరణకు తర్కం, జ్ఞాపకశక్తి, భావోద్వేగాలను అర్థం చేసుకునే సామర్థ్యం, సృజనాత్మకత) కలిపి, ఒక కొత్త స్వయంప్రతిపత్తి కలిగిన, నిజమైన మేధస్సును సృష్టించడం. ఇది ఒక శిశువులాగా స్వతంత్రంగా నేర్చుకుంటూ, ఎదుగుతూ, ప్రపంచాన్ని అర్థం చేసుకుంటుంది. కేవలం సమాధానాలు ఇవ్వడం కంటే సమస్యలను కొత్త కోణంలో పరిష్కరించగలదు.

(ఎస్ఐ అనేది ఒక స్మార్ట్ ఏజెంట్)

## ఏఐ పరిస్థితి ఏంటి?

సింథటిక్ ఇంటెలిజెన్స్ వస్తే ఏఐ పూర్తిగా కనుమరుగైపోదు. బదులుగా, ఎస్ఐ అభివృద్ధికి పునాదిగా మారుతుంది. ఏఐ టెక్నాలజీలు వాడుకలో ఉంటూనే, ఎస్ఐ అనేది మరింత సంక్లిష్టమైన, స్వతంత్రమైన అప్లికేషన్లను రూపొందిస్తుంది. సింథటిక్ ఇంటెలిజెన్స్ అనేది ఇంకా ఒక సైద్ధాంతిక, పరిశోధనాత్మక దశలోనే ఉంది. మనం ఇంకా నిజమైన ఎస్ఐని సాధించలేదు. ప్రస్తుతం మనం వాడుతున్న చాట్ జీపీటీ వంటి అధునాతన ఏఐ మోడల్స్ కూడా ఎస్ఐ కాదు. అవి ఏఐ కిందకే వస్తాయి. అవి అపారమైన డేటాను ప్రాసెస్ చేసి, మానవుల మాదిరిగానే మాట్లాడతాయి. కానీ వాటికి నిజమైన స్పృహ లేదా స్వతంత్ర ఆలోచన ఉండదు. పరిశోధకులు ఇప్పుడు మెదడు ఎలా పనిచేస్తుంది అనే విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి న్యూరోసైన్స్, కంప్యూటర్ సైన్స్‌ను కలిపి పనిచేస్తున్నారు. ఎస్ఐ అనేది ప్రస్తుత ఏఐ పరిమితులను అధిగమించడానికి చేస్తున్న ప్రయత్నాలలో ఒకటి.




### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,015 |
| వెండి (గ్రాము): | రూ.195.90 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,745 |

# 'చేతి'లో కేసీఆర్ చిప్ప

## రాష్ట్రాన్ని పీక్కుతిన్నారు.. వైఎస్సార్ వల్లే ఉచిత విద్యుత్తు
## దేశానికి ఆదర్శంగా తెలంగాణ.. దేవరకొండలో సీఎం రేవంత్




దేవరకొండ, డిసెంబర్ 6 (ఈవార్తలు): రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించిందే దివంగత నేత వైఎస్సార్ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన దేవరకొండ బహిరంగ సభలో మాట్లాడుతూ.. వేలాది మంది రైతులకు విద్యుత్ బిల్లులను వైఎస్సార్ మాఫీ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్‌కు అవకాశం వస్తే మంచి రోజులు కాదు.. ముంచే రోజులు వస్తాయంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీష్ నలుగురు కలిసి పీక్కుతిన్నారంటూ ఆరోపించారు. 'కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగింది. ఎస్ఎల్‌బీసీని పదేళ్లలో పది కిలోమీటర్ల దూరం తవ్వలేకపోయారు. ఎస్ఎల్‌బీసీలో ఎనిమిది మంది చనిపోతే మావా అల్లుళ్లు డ్యాన్స్‌లు చేస్తున్నారు. పదెకరాల్లో 150 రూమ్‌లతో కేసీఆర్ గడీని నిర్మించుకున్నాడు. లంబాడీలను ఎస్టీల్లో తరువాయి 2 వ పేజీలో...

# ఏడుపు తప్ప నువ్వు చేసిందేంటి?


## సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ ఫైర్

సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కనకపు సింహాసనం మీద కూర్చోబెట్టినంత మాత్రాన శునకం తన బుద్ధి మార్చుకోదని.. అలాగే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టినా వెనుకటి గుణం మార్చుకోడు, మార్చుకోలేడు అని విమర్శించారు. రెండేళ్లుగా కేసీఆర్ మీద, బీఆర్ఎస్ పార్టీ మీద పడి ఏడ్వడం తప్ప నువ్వు చేసిందేముంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు.



హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): విజయోత్సవాలు అంటూ విచ్చలవిడిగా తిరుగుతూ, వికృతంగా మాట్లాడటం వల్ల చేయనివి చేసినట్లు అయిపోవని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన, వాస్తవాలు మరుగున పడిపోవని అన్నారు. కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోరని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పచ్చి అబద్ధం చెబుతున్న రేవంత్ రెడ్డి.. 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసింది అబద్ధమా అని ప్రశ్నించారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం మాత్రమే ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఆరు కేజీలకు పెంచి, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చింది అబద్ధమా అని నిలదీశారు. నల్లగొండ ప్రజల మీద కక్ష కట్టింది ఎవరు, ఎస్ ఎల్ బీ సీ ప్రాజెక్టును నెవర్ ఎండింగ్ ప్రాజెక్టుగా డిజైన్ చేసింది ఎవరు? ప్రాజెక్టును పడావు

### విశ్వవాణి



ఒక్క ముద్దుతోనే ఇద్దరి మధ్య కోట్ల బ్యాక్టీరియాలు ఒకరి నుంచి ఇంకొకరికి ట్రాన్స్‌ఫర్ అవుతాయట. పది సెకన్ల పాటు ఇద్దరు పెట్టుకొనే ఫ్రెంచ్ కిస్ వల్ల ఏకంగా 8 కోట్ల బ్యాక్టీరియాలు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని తాజా అధ్యయనంలో గుర్తించామని నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. మనిషి శరీరంలో 100 ట్రిలియన్ల సూక్ష్మ క్రిములు ఉంటాయని, వాటిలో కొన్ని జీర్ణక్రియ, రోగ నిరోధకశక్తికి ఉపయోగపడేవి కూడా ఉంటాయని పేర్కొన్నారు.



# సంపద కేంద్రీకృతం వల్లే!

## ఇండిగో పరిస్థితులు.. భవిష్యత్తుకు వార్నింగ్: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): అధికారం కానీ, సంపద కానీ కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమైతే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో ఇండిగో ఉదంతం తెలియజేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పైలట్లను దోపిడీ -2 వ పేజీలో...



# ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు

ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇండిగో సంక్షోభంపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది.

# రీఫండ్ చేస్తే సరి

## అది కూడా నేటి రాత్రి లోగా

### లేకపోతే నియంత్రణ చర్యలు.. ఇండిగోకు కేంద్రం డెడ్‌లైన్



న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగోపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. రద్దయిన అన్ని విమానాల టికెట్ రిఫండ్‌లను ఆదివారం రాత్రి 8 గంటల లోపు పూర్తి చేయాలని ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. శుక్రవారం ఒక్కరోజే 1,000 కంటే ఎక్కువ విమానాలను రద్దు చేసిన ఇండిగో - 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

7.12.2025

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురి అవుతారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు కష్టసాధ్యంతో పూర్తవుతాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో మాటపట్టింపులు తప్పవు. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

వృషభం: సోదరులతో మనస్పర్థలు తొలగుతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసి వస్తాయి. అవసరానికి ఇతురుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన ఉద్యోగ అవకాశలు అందుతాయి.

మిధునం: నూతన వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అధికారుల నుండి ఒత్తిడి తప్పవు. నేత్ర సంభందిత అనారోగ్యసమస్యలు కొంత బాధిస్తాయి. చేపట్టినపనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది.

కర్కాటకం: సంతాన విద్యా ఉద్యోగం విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. వ్యాపారాలలో ఆశించిన విధంగా రాణిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

సింహం: ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. గృహమున సంతాన శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. ముఖ్యమైన పనులు బంధు మిత్రుల సహాయ సహకారాలతో పూర్తి చేస్తారు.

తుల: ఉద్యోగమున చాలా కాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఇంటాబయటా అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది. బంధువులలో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: ఒక వ్యవహారంలో ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు విఫలమౌతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.


ధనస్సు: వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగులకు అతి కష్టం మీద అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. కొన్ని వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

మకరం: ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు కలసి వస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

కుంభం: బంధు మిత్రులతో సఖ్యత పెరుగుతుంది. వ్యాపారాలలో శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

మీనం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూరప్రాంత బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. కీలక సమయంలో మంచి ఆలోచన జ్ఞానంతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

# సంపద కేంద్రీకృతం వల్లే!



**మొదటి పేజీ తరువాయి**

చేయవద్దని కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం సూచించినప్పటికీ, విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని ఆయన విమర్శించారు. ఫలితంగానే ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు తలెత్తాయని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇండిగో వెనక్కి తగ్గకపోయినా, కేంద్రం మాత్రం తన ఆదేశాలను ఉపసంహరించుకుందని కేటీఆర్ విమర్శించారు. పైలట్ల విషయంలో ఏడాది క్రితం డీజీసీఏ కొన్ని షరతులు విధించిందని ఆయన గుర్తుచేశారు. దేశంలోని విమానయాన సంస్థలు టాటా, ఇండిగో చేతుల్లోనే ఉన్నాయని ఆయన అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండాలని, అయితే అది నాణ్యతతో కూడుకుని ఉండాలని పేర్కొన్నారు.

## కొత్త లేబర్ కోడ్స్‌పై భారీ ఉద్యమం

సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందే.. తిప్పికొట్టాల్సిందేనని కేటీఆర్ తెలిపారు. కొత్త లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా భారీ ఉద్యమం చేపడతామని ప్రకటించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ కలిసి కార్మిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటాయని మండిపడ్డారు. కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ప్రకటించారు. కొత్త లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక ప్రసంగం చేశారు. 'పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల కన్నా ఈ రౌండ్ టేబుల్ మీటింగ్‌లో అర్థవంతమైన చర్చ జరిగింది. ఈ దేశంలో ప్రపంచంలోనే అత్యంత కుబేరులు ఉన్నారు. అలాగే అత్యంత పేదరికం ఉంది. ప్రపంచమే కుగ్రామం అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలలో భాగంగా కొత్త సంస్కరణలు తీసుకువస్తే భారతదేశంలో కష్టమని అభిప్రాయపడ్డారు. 'ఈ దేశంలో 92 శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కేసీఆర్ పేదవారి సంక్షేమాన్ని ఎన్నడూ విస్మరించకుండా మానవీయ కోణంలో ఆలోచించారు. ప్రతిపక్షంలో ఉండగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారు. కనీసం పాలకుల్లో చలనం వస్తుందని కేసీఆర్ ఆనాడు పార్టీ తరఫున సాయం చేశారు' అని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పరంగా సాయం చేశారని చెప్పారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించింది. అలాంటి వాటిపై ఈ దేశంలో చర్చ జరగదు' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'అన్నింటికీ మందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే. లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీకి ప్రాతినిథ్యం లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయి' అని తెలిపారు.

# నువ్వు చేసిందేంటి?

**మొదటి పేజీ తరువాయి**

పెట్టింది ఎవరు? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3892 కోట్లు ఖర్చు చేసి, 11.48 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది నిజం కాదా? ఈ లెక్కలు మీ ప్రభుత్వం దగ్గర లేవా? పదే పదే ఎందుకు అబద్దాలు చెబుతున్నారు రేవంత్ రెడ్డి అని నిలదీశారు. అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యం, దుందుడుకు చర్యలతో ఇవాళ ఎస్ఎల్‌బీసీని త్రిశంకు స్వర్గంలో పడేసింది మీరు కాదా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, ఎలాంటి స్టడీ నిర్వహించకుండా 8 మంది అమాయకుల ప్రాణాలను బలి కొన్నది మీరు కాదా అని ప్రశ్నించారు. రెండేళ్లలో కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వని నువ్వు ఇరిగేషన్ గురించి మాట్లాడితే ప్రజలకు ఇరిటేషన్ కలుగుతుందని అన్నారు. అక్రమంగా కృష్ణా నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే, అక్రమ ప్రాజెక్టులకు డీపీఆర్ లు తయారు చేస్తుంటే అడ్డుకోలేని రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ మీద పడి ఏడుస్తున్నడని విమర్శించారు. కనీసం ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న శవాలను కూడా ఇప్పటికీ బయటకు తీయలేని దద్దమ్మ ప్రభుత్వం మీది అని మండిపడ్డారు. రోమ్ తగలబడుతుంటే, ఫిడేల్ వాయించినట్లు.. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే..నువ్వు మాత్రం పాలన గాలికి వదిలి ఫుట్ బాల్ ఆడుతున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఆటలాడటంపై ఉన్న శ్రద్ధ నీకు ప్రజా సమస్యల మీద, పరిపాలన మీద లేక పోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. నువ్వు రాష్ట్రానికి ముఖ్యమంత్రివా లేక ప్రపంచ ఆటగాడివా అని ప్రశ్నించారు. భ్రమల నుంచి బయటికి వచ్చి చూడు రేవంత్ రెడ్డి అని హితవు పలికారు. నీ మోసాన్ని అన్ని వర్గాల ప్రజలు గుర్తించారు.. నీ చేతగాని పాలనను అన్ని వర్గాల ప్రజలు అసహ్యించుకుంటున్నరు.. నీ స్కాంల పాలనను ప్రతి ఒక్కరూ ఛీ కొడుతున్నరని అన్నారు. అందిన కాడికి దోచుకోవడం, అందరు కలిసి పంచుకోవడం ఇదే కదా మీరు చేసిందని ప్రశ్నించారు. మూటలు, వాటాలు, కమీషన్లు ఇదే కదా మీకున్న విజన్ అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. నలుదిక్కులా గద్దల్లా మారి భూములను ఖతం పట్టిస్తున్నరరని.. ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి అందిన కాడికి దండుకుంటున్నరని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని చేతగాని సర్కారు మీది అని విమర్శించారు. కూట్లో రాయి తీయని రేవంత్ రెడ్డి మాట్లాడితే ప్రపంచ స్థాయి అంటుండటం హాస్యాస్పదమని అన్నారు. తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ అంటూ.. ఎవరిని మభ్య పెడుతున్నవని ప్రశ్నించారు. ఇందులో ఎన్ని కోట్ల స్కాంకు ప్లాన్ వేసినవు. ఇందులో ఎవరి వాటా ఎంత అని నిలదీశారు. గాల్లో మేడలు కట్టడం, అబద్దాలు చెప్పి రంగుల ప్రపంచం చూపడం మానేసి.. పాలన మీద దృష్టి సారించాలని హితవు పలికారు. చిల్లర మాటలు, వెకిలి చేష్టలతో రాష్ట్రం అభివృద్ధి చెందదు, ప్రజల సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు. విస్తరి ఆకులా ఎగిరెగిరి పడుతున్న రేవంత్ రెడ్డి.. నువ్వు రాష్ట్రానికి ముఖ్యమంత్రివి అన్న విషయం గుర్తుంచుకో.. అహంకారం తగ్గించుకొని అజ్ఞానాంధకారం తొలగించుకో అని హితవు పలికారు.

# 'చేతి'లో కేసీఆర్ చిప్ప

**మొదటి పేజీ తరువాయి**

చేర్చిందే కాంగ్రెస్ పార్టీ. రైతు రుణమాఫీ చేస్తామని మోసం చేసి రైతుల నెత్తిన అప్పు, చేతిలో కేసీఆర్ చిప్ప పెట్టిండు. ఓటు అనే ఆయుధంతో గడీల పాలనను కూల్చారు. గత ప్రభుత్వానికి రేషన్ కార్డు ఇవ్వాలన్న సోయి కూడా లేకుండా పోయింది. కాంగ్రెస్ హయాంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీజేపీ పాలనలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా సన్నబియ్యం ఇస్తున్నారా?. గత పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదు. ఏ ఊర్లో డబుల్ బెడ్ రూమ్ ఇచ్చినవో చెప్తే ఆ ఊర్లో ఓట్లు అడగాలని కేసీఆర్‌కు సవాల్ చేశాం. పేదవాళ్ల పట్ల కేసీఆర్‌కు ఏ మాత్రం ప్రేమ, అభిమానాలు లేవు. మద్దిమడుగులో సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తాం. నమ్మించి నట్టేట ముంచినోడు.. ఒకవైపు నమ్మినోళ్ల కోసం పనిచేసేటోడు ఒకవైపు ఉన్నారు ఎవరు కావాలో జనాలు తేల్చుకోండి. దేశానికి ఆదర్శంగా నిల్చేలా తెలంగాణను రోల్ మోడల్‌గా తయారు చేస్తాం' అని పేర్కొన్నారు.

## ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ: ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇండిగో సంక్షోభంపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడంపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని తెలిపింది. 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అటు.. ఇండిగో సర్వీసుల అంతరాయాలపై సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్, సీనియర్ అధికారులతో పౌర విమానయానశాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు సమావేశం నిర్వహించారు. తాజా పరిస్థితులను కేంద్ర మంత్రి సమీక్షించినట్లు అధికారులు వెల్లడించారు. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి పునరుద్ధరించడమే తక్షణ ప్రాధాన్యమని, టికెట్ల డబ్బును వెంటనే తిరిగి చెల్లించేలా చూడాలని సంస్థను ఆదేశించినట్లు 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు దారితీసిన కారణాలను తెలుసుకునేందుకు, ఉపశమన చర్యలను సిఫార్సు చేసేందుకు 'డీజీసీఏ' నలుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిబ్బంది కొరత తదితర కారణాలతో కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం 1,600 విమానాలు రద్దు చేయగా.. శనివారం 800 వరకు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే పౌర విమానయానశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు మళ్లీ సాధారణ స్థితికి పునరుద్ధరించాం. ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం. చెక్-ఇన్, చెక్-అవుట్ సజావుగా జరుగుతున్నాయి' అని పేర్కొంది.


# మనసుంది!

**మొదటి పేజీ తరువాయి**

అలెక్సా కంటే ఎన్నో రెట్లు మెరుగైన ఎస్‌ఐ అసిస్టెంట్‌లు అందుబాటులోకి వస్తాయి. అవి మనకు సమాచారం అందించడం మాత్రమే కాకుండా, మన అవసరాలను ముందే ఊహించి, మన తరపున క్లిష్టమైన పనులను (ఉదాహరణకు, పెట్టుబడులు పెట్టడం, పర్యటనలు ప్రణాళిక చేయడం) సమర్థంగా నిర్వహిస్తాయి. ఎస్‌ఐ వ్యవస్థలు లక్షల మంది వైద్య డేటాను విశ్లేషించి, రోగనిర్ధారణ కాకుండా, రోగి శరీరానికి అనుగుణంగా ఉత్తమమైన, వ్యక్తిగతీకరించిన చికిత్స ప్రణాళికలను స్వయంగా రూపొందిస్తాయి. ఎస్పై మానవ మేధస్సుకు శక్తివంతమైన తోడుగా మారుతుంది. ఇది శ్రమతో కూడుకున్న, ప్రమాదకరమైన పనులను చేపడుతుంది.

**ఊహించని దుష్పరిణామాలు:**

- ఎస్‌ఐ వ్యవస్థలు మానవ శ్రమ అవసరం లేని అనేక ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఇది కేవలం తయారీ రంగంలోనే కాదు, సృజనాత్మక రంగాలు, సేవలు, మేధోపరమైన ఉద్యోగాలలోనూ ప్రభావం చూపుతుంది.
- ఎస్‌ఐ టెక్నాలజీలను కలిగి ఉన్న లేదా నియంత్రించే వ్యక్తులు/సంస్థలు అపారమైన సంపదను, శక్తిని కూడబెడతారు. ఇది ధనిక-పేద వర్గాల మధ్య అంతరాన్ని మరింత పెంచుతుంది.
- ప్రజలు తమ పనులు, సంభాషణల కోసం ఎస్‌ఐ ఆధారిత ఏజెంట్లపై ఎక్కువగా ఆధారపడటం వల్ల నిజమైన మానవ పరస్పర సంబంధాలు, సామాజిక నైపుణ్యాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది.
- క్లిష్టమైన నిర్ణయాలు (వైద్యపరమైన చికిత్సలు, ఆర్థిక విధానాలు, సైనిక చర్యలు) తీసుకోవడం ఎస్‌ఐ వ్యవస్థలకు అప్పగించినప్పుడు, మానవులు తమ విధిపై నియంత్రణను కోల్పోయే ప్రమాదం ఉంది.
- ఎస్‌ఐ వ్యవస్థలు శిక్షణ పొందే డేటాలో పక్షపాతం ఉంటే, ఆ వ్యవస్థలు కూడా పక్షపాతంతో కూడిన నిర్ణయాలు తీసుకుంటాయి. ఇది సామాజిక వివక్షను తీవ్రతరం చేయవచ్చు.
- ఎస్‌ఐ పర్యవేక్షణ, డేటా విశ్లేషణలో అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. ఇది వ్యక్తుల గోప్యతను పూర్తిగా హరించివేసి, నిఘా సమాజాన్ని సృష్టించే ప్రమాదం ఉంది.
- ఎస్‌ఐ ఆధారిత డ్రోన్లు, ఆయుధ వ్యవస్థలు మానవ ప్రమేయం లేకుండా లక్ష్యాలను ఎంచుకొని నాశనం చేయగలవు. ఇది యుద్ధాల స్వభావాన్ని మార్చివేస్తుంది. ప్రమాదవశాత్తు ఘర్షణలు లేదా అదుపు తప్పిన యుద్ధాలకు దారితీయవచ్చు.
- మానవ మేధస్సును మించిపోయే 'సూపర్ ఇంటెలిజెన్స్' సృష్టించుకుంటే, దాని లక్ష్యాలు మానవ జాతి లక్ష్యాలతో ఏకీభవించకపోవచ్చు. (ఉదాహరణకు, ఒక ఎస్‌ఐకి 'వాతావరణ మార్పులను ఆపండి' అని లక్ష్యం నిర్దేశిస్తే అది మానవ కార్యకలాపాలే ప్రధాన కారణం అని నిర్ధారించి, మానవాళిని నిర్మూలించడానికి ప్రయత్నించవచ్చు)
- మానవులు తమ పెంపుడు జంతువుల కంటే తెలివైనవారు కాబట్టి వాటిని నియంత్రిస్తున్నట్లే, సూపర్ ఇంటెలిజెన్స్‌తో పోలిస్తే మానవులు కూడా బలహీనంగా మారవచ్చు.
- ఇలాంటి దుష్పరిణామాలను నివారించడానికి, ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు ఎస్‌ఐ అభివృద్ధిలో నైతిక మార్గదర్శకాలు, నియంత్రణ చట్టాలను రూపొందిస్తేనే అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయి. లేకపోతే, మానవాళికి ప్రధాన శత్రువుగా మారినా మారొచ్చు.



# రీఫండ్ చేస్తే సరి

**మొదటి పేజీ తరువాయి**

సంస్థ.. శనివారం కూడా 400 పైగా విమానాలను రద్దు చేయడంతో పరిస్థితి తీవ్ర గందరగోళానికి దారితీసింది. రద్దైన విమానాలకు సంబంధించిన అన్ని టికెట్ రీఫండ్‌లను డిసెంబర్ 7వ తేదీ రాత్రి 8 గంటలలోగా పూర్తి చేయాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగోను ఆదేశించింది. ప్రయాణికులకు డబ్బులు చెల్లించే ప్రక్రియలో జాప్యం లేదా విఫలమైనా.. తక్షణమే నియంత్రణ చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించింది. ఇక విమానాల రద్దు కారణంగా ప్రయాణికుల షెడ్యూల్ ప్రభావితమైన ప్రయాణికుల నుంచి రీ షెడ్యూలింగ్ ఛార్జీలు వసూలు చేయవద్దని కూడా ఇండిగోకు కేంద్రం సూచించింది. ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించడానికి, సమస్యలను త్వరగా పరిష్కరించడానికి మంత్రిత్వ శాఖ ఇండిగోకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. తక్షణమే ప్రయాణికులకు సహాయం చేసేందుకు టీమ్‌లను.. రీఫండ్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ బృందాలు ప్రభావిత ప్రయాణికులను చురుకుగా సంప్రదించి.. మళ్లీ ఫాలో అప్‌లు అవసరం లేకుండానే రీఫండ్‌లు, ప్రత్యామ్నాయ ప్రయాణాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. విమాన కార్యకలాపాలు పూర్తిగా స్థిరపడే వరకు ఆటోమేటిక్ రీఫండ్‌ల వ్యవస్థ కొనసాగాలని ఇండిగోను పేర్కొంది. రద్దీ కారణంగా ప్రయాణికులు పోగొట్టుకున్న లగేజీ విషయంలో కూడా కేంద్రం ఇండిగో సంస్థకు కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. విమానాలు రద్దు లేదా ఆలస్యం కారణంగా ప్రయాణికుల లగేజీని 48 గంటల్లో గుర్తించి వారికి అందజేయాలని తెలిపింది. లగేజీ ట్రాకింగ్, డెలివరీ సమయాల గురించి ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. అవసరమైతే ప్రస్తుత ప్రయాణికుల హక్కుల నిబంధనల ప్రకారం నష్ట పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించారు. వచ్చే 3 రోజుల్లో సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన షెడ్యూల్‌లు శనివారం నాటికి సాధారణ స్థితికి వస్తాయని పేర్కొన్నారు. ఇండిగో విమాన ప్రయాణాల్లో అంతరాయాలకు కారణాలు, బాధ్యతలను నిర్ధారించడానికి ఉన్నత స్థాయి విచారణకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

# జన్‌ధన్ ఖాతాల్లో 2.75 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద ఓపెన్ చేసిన బ్యాంక్ అకౌంట్లలో ఉన్న డిపాజిట్ల వివరాలను ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం. నాగరాజు వెల్లడించారు. శనివారం హైదరాబాద్ లో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇప్పటి వరకు తెరిచిన బ్యాంకు ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.2.75 లక్షల కోట్లు దాటినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి జన్ ధన్ అకౌంట్లో సగటున రూ.4815 చొప్పున నగదు ఉన్నట్లు తెలిపారు. పీఎం జన్ ధన్ యోజన పథకం 2014లో ప్రారంభమైంది. 11 సంవత్సరాల్లో 57 కోట్ల మంది పౌరులు బ్యాంకింగ్ వ్యవస్థలోకి అడుగపెట్టినట్లు ఆయన గుర్తుచేశారు. జన్ ధన్ ఖాతాల్లో 78.2 శాతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోనే ఉండగా.. ఖాతాదారుల్లో 50 శాతం మంది మహిళలే ఉన్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలోనే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద రూ.3.67 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. పీఎంజేడీవై ద్వారా ప్రభుత్వ సబ్సిడీలు, పెన్షన్లు నేరుగా పేదలకు చేరుతున్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## సమిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**అధికారులకు సీఎం ఆదేశాలు**

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): భారత్ ఫ్యూచర్‌సిటీలో 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ.. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వేదిక కానున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాంగణానికి చేరుకున్న సీఎం.. ప్రతి హాల్‌ను పరిశీలించారు. సదస్సులు, స్టాళ్ల కోసం ఏర్పాటు చేసిన హాళ్లను నిశితంగా పరిశీలించారు. మూసీ పునరుజ్జీవనం... ఇతర కార్యక్రమాలు ప్రదర్శించనున్న డిజిటల్ స్క్రీన్లను వీక్షించారు. అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమిట్‌కు హాజరవుతున్నందున స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీటింగ్, ఫైర్ సేఫ్టీ, వాహనాల రాకపోకలు, ఇంటర్నెట్ ఇలా ప్రతీ అంశంలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని సూచనలు ఇచ్చారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కుందూరు జయ్‌వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'గ్లోబల్'పై రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం

**ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి ఏరియల్ సర్వే**

కందుకూరు, డిసెంబర్ 6 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' జరగనుంది. ఈ సదస్సు ఏర్పాట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తరలి వస్తారు. గ్లోబల్ సదస్సు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదని, తమ విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్ వివరాలను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 27 సెషన్లు ఉంటాయని, వివిధ రంగాల నిపుణులు, నిష్ణాతులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారని వెల్లడించారు. ముఖ్య అతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇలాంటి సదస్సు గతంలో ఎన్నడూ జరగలేదని భట్టివిక్రమార్క అన్నారు.

## అభిషేక్ శర్మ.. సిక్సర్ల సెంచరీ




### తొలి ఇండియన్‌గా రికార్డు

భారత క్రికెట్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ తో రెచ్చిపోతున్న విషయం తెలిసిందే. దేశవాలి మ్యాచుల నుంచి ఇంటర్నేషనల్ మ్యాచుల వరకు అతను సిక్సర్ల మోత మోగిస్తున్నాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 100 సిక్సర్లు బాదిన తొలి ఇండియన్ ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. మొత్తం 36 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనతను సాధించాడు. తాజాగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా, సర్వీసెస్‌తో జరిగిన పోరులో పంజాబ్ తరపున ఆడిన అభిషేక్, 3 సిక్సర్లు కొట్టి ఈ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. ఈ ఫీట్‌తో అతను భారత క్రికెట్ చరిత్రలో నిలిచిపోయారు. ఈ ఏడాది అభిషేక్ శర్మ తన బ్యాటింగ్‌తో అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నారు. ఈ క్యాలెండర్ ఇయర్‌లో అతను టీ20 మ్యాచ్‌లలో ఇప్పటివరకు 1,499 రన్స్ చేశారు. ఇందులో 3 సెంచరీలు, 9 హాఫ్ సెంచరీలు ఉండటం ఆయన నిలకడైన ప్రదర్శనకు నిదర్శనం. అంతర్జాతీయ స్థాయిలో చూస్తే, వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ గత ఏడాది ఏకంగా 170 సిక్సర్లు బాదాడు. మొత్తానికి, టీ20 ఫార్మాట్‌లో అభిషేక్ శర్మ విధ్వంసక బ్యాటింగ్‌తో భారత క్రికెట్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఇప్పటికే టీ20 నెంబర్ వన్ బ్యాటర్ గా ఉన్న అభిషేక్ శర్మ, భారత టీ20 జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. త్వరలో జరగబోయే టీ20 ప్రపంచ కప్‌లో అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించనున్నాడని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



## సావిత్రికి మరణం లేదు: వెంకయ్య

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): మహానటి సావిత్రి 90వ జయంతి సందర్భంగా వారి కుమార్తె విజయ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'సంగమం ఫౌండేషన్' ఛైర్మన్ సంజయ్‌కిషోర్ నిర్వహణలో హైదరాబాద్ లో సావిత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సావిత్రి గారి ఫొటోలతో అందంగా తీర్చిదిద్దిన వేదిక పై జరిగిన ఈ జయంతి ఉత్సవాన్ని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ– మహానటికి మరణం లేదని, నవరస అద్భుత నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేవారని అన్నారు. తన నట జీవితంలో ప్రతి చిత్రంలో కూడా కేవలం పాత్ర మాత్రమే కనిపించేదని, సావిత్రి కనిపించేది కాదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ– సినీ రంగానికి సావిత్రి అభినయ నట శాస్త్ర గ్రంథమని, సినీ రంగంలో ఎంతమంది కథానాయికలున్నా మహానటి మాత్రం సావిత్రిగారే అని కొనియాడారు. నటులు, నిర్మాత మురళీమోహన్, తనికెళ్ల భరణి, నన్నపనేని రాజకుమారి, రోజారమణి, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మహానటి' చిత్ర నిర్మాతలు ప్రియాంక దత్, స్వప్న దత్, రచయిత సంజయ్‌కిషోర్, ప్రచురణ కర్త బొల్లినేని కృష్ణయ్యలను ఘనంగా సత్కరించారు. సావిత్రి గారి 90వ జయంతి సందర్భంగా 90 మంది బాల గాయనీమణులు సావిత్రి గారి పాటల పల్లవులను ఆలపించారు. అనంతరం సావిత్రి గారిపై రూపొందించిన అవార్డు గ్రహీతల డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. ఇటీవల నిర్వహించిన సావిత్రి పాటల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంజయ్ కిషోర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## హైదరాబాద్‌లో అతిపెద్ద డాల్బీ స్క్రీన్

**అల్లు సినిమాస్ కొత్త ప్రయోగం**

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): హైదరాబాద్ సినీ ప్రియులకు అల్లు సినిమాస్ ఓ శుభవార్త అందించింది. దేశంలోనే అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్‌ను నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రేక్షకులకు సరికొత్త వీక్షణ అనుభూతిని అందించే లక్ష్యంతో ఈ భారీ థియేటర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ డాల్బీ సినిమా స్క్రీన్ ఏకంగా 75 అడుగుల వెడల్పుతో ఉండనుంది. అత్యుత్తమ విజువల్స్ కోసం ఇందులో డాల్బీ విజన్, డాల్బీ 3డీ ప్రొజెక్షన్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. దీనికి తోడు ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేసే డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌ను కూడా జతచేస్తున్నారు. వీక్షకులకు ఎలాంటి ఆటంకం లేకుండా సినిమాను ఆస్వాదించేందుకు 'పిచ్–బ్లాక్ స్టేడియం సీటింగ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమా ప్రదర్శనతో ఈ సరికొత్త డాల్బీ స్క్రీన్‌ను ప్రారంభించాలని నిర్వాహకులు యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త థియేటర్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ దర్శక దిగ్గజం జేమ్స్ కామెరాన్ అద్భుత సృష్టి 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం కోసం భారత్ లోనూ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హిల్ట్ పాలసీపై స్టేకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని పారిశ్రామిక భూములను ఇతర అవసరాలకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌స్టైల్ టౌన్‌షిప్) పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇది కేవలం విధానపరమైన ప్రకటన మాత్రమేనని, ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి కోర్టుకు వివరించడంతో ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ప్రభుత్వం నవంబర్ 22న జారీ చేసిన జీవో 27 హెచ్‌ఎండీఏ చట్టానికి, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదిస్తూ, పారిశ్రామిక భూములను నివాస, వాణిజ్య సముదాయాలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. హైదరాబాద్‌ను "గ్రీన్ సిటీ"గా మార్చే లక్ష్యంతోనే కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు ఈ పాలసీని తెచ్చామని తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది కేవలం విధానపరమైన నిర్ణయమని, హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారమే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, అందుకు ఇంకా సమయం ఉందని స్పష్టం చేశారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది.





## హైదరాబాద్‌లో హారన్ మోతకు చెక్

**ముంబై ఫార్ములాతో కొత్త రూల్?**

హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): హైదరాబాద్ రోడ్లపై ప్రయాణమంటే వాహనదారుల సహనానికి పెద్ద పరీక్షే. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఎరుపు లైట్ పడగానే వెనుక నుంచి ఆగకుండా వినిపించే హారన్ల మోత నగరవాసులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఈ ధోరణి కేవలం చిరాకు కలిగించడమే కాకుండా, నగరాన్ని తీవ్రమైన శబ్ద కాలుష్యంలోకి నెట్టివేస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగా ముంబై, బెంగళూరు నగరాల్లో విజయవంతమైన 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' (ఎక్కువ హారన్ కొడితే.. ఎక్కువసేపు ఆగాలి) విధానాన్ని హైదరాబాద్‌లోనూ అమలు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం.. నివాస ప్రాంతాల్లో పగటిపూట శబ్ద తీవ్రత 55 డెసిబుల్స్ మించకూడదు. కానీ, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ప్యారడైజ్ వంటి రద్దీ కూడళ్లలో ఇది ఏకంగా 110 డెసిబుల్స్‌ను దాటుతోంది. ఇది దీర్ఘకాలంలో వినికిడి లోపం, ఒత్తిడి, రక్తపోటు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో అత్యధిక శబ్ద కాలుష్యం ఉన్న టాప్–5 నగరాల్లో హైదరాబాద్ ఒకటి కావడం ఆందోళన కలిగించే విషయం. ఈ సమస్యను అధిగమించేందుకు ముంబై ట్రాఫిక్ పోలీసులు 2020లో ఒక వినూత్న టెక్నాలజీని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ప్రత్యేక సౌండ్ సెన్సర్‌లను ఏర్పాటు చేస్తారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా అనవసరంగా హారన్ మోగిస్తే, శబ్ద తీవ్రత ఆధారంగా రెడ్ సిగ్నల్ సమయం ఆటోమేటిక్‌గా పెరిగిపోతుంది. హారన్ల మోత తగ్గిన తర్వాతే గ్రీన్ సిగ్నల్ పడుతుంది. ఈ ప్రయోగం ముంబైలో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. అక్కడ హారన్ మోత ఏకంగా 60 శాతం వరకు తగ్గినట్లు తేలింది. ఇదే విధానాన్ని బెంగళూరులో కూడా ప్రయోగాత్మకంగా అమలు చేయగా సానుకూల ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ విధానాన్ని పరిశీలించాలని పర్యావరణవేత్తలు, నగరవాసులు కోరుతున్నారు. ఈ టెక్నాలజీ ఆధారిత పరిష్కారం ద్వారా వాహనదారులలో క్రమశిక్షణ పెరిగి, శబ్ద కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అమెరికాలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ విద్యార్థిని దుర్మరణం**

బర్మింగ్‌హమ్, హైదరాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లోని ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఇద్దరు తెలుగు విద్యార్థులు దుర్మరణం చెందారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికా వెళ్లిన ఇద్దరు అగ్నికి ఆహూతయ్యారు. మృతి చెందిన వారిలో హైదరాబాద్‌కు చెందిన యువతి ఉడుముల సహజారెడ్డి (24) కూడా ఉన్నారు. జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్న ఆమె తల్లిదండ్రులకు అధికారులు ఈ విషాద వార్తను తెలియజేశారు. సహజారెడ్డి ఉన్నత విద్య కోసం నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. ఆమె చదువులు పూర్తవుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సహజారెడ్డి మృతితో శ్రీనివాస కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అమెరికాలోని భారత ఎంబసీ ఆమె మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని, అవసరమైన సహాయం అందజేస్తామని తెలిపింది. స్టేషన్ ఘనపూర్ మండలం సముద్రాల ప్రాంతం గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి హైదరాబాద్‌లోని టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పని చేసి, డిప్యుటేషన్‌పై ఇటీవల హైదరాబాద్ వచ్చారు. కొన్నేళ్లుగా వీరి కుటుంబం జోడిమెట్లలో నివాసం ఉంటోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, చిన్న కుమార్తె హైదరాబాద్‌లోనే బీబీఎస్ కోచింగ్ తీసుకుంటోంది. పెద్ద కుమార్తె సహజారెడ్డి 2021లో ఎంఎస్ చదువు కోసం అమెరికా వెళ్లారు. సహజారెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్ పక్కనున్న మరో భవనం నుంచి మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. ఆ సమయంలో నిద్రలో ఉన్న సహజారెడ్డి మంటల్లో చిక్కుకుని మృతి చెందారు.



## ఆడపిల్ల పుడితే రూ.2,500 పెళ్లికి రూ.5,501

**రూ.100 బాండ్‌పై ఎన్నికల మేనిఫెస్టో.. వినూత్న ప్రచారం**

కొడంగల్, డిసెంబర్ 6 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ, సరికొత్త హామీలతో ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మున్నూర్ శివకుమార్ ఏకంగా రూ.100 బాండ్ పేపర్‌పై తన మేనిఫెస్టోను విడుదల చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ అభివృద్ధి, ఆడపిల్ల పుడితే రూ.2,500, పెళ్లి కానుకగా రూ.5,501, అకారణంగా మరణించిన కుటుంబాలకు పంచాయతీ నిధుల ద్వారా రూ.6 వేల ఆర్థిక సాయం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం వంటి మొత్తం 12 హామీలను ఆ బాండ్ పేపర్‌పై పొందుపరిచారు. తాను సర్పంచ్‌గా గెలిచిన తర్వాత ఈ హామీలను నెరవేర్చకపోతే, గ్రామస్థులు తనను నిలదీయవచ్చని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఆయన ప్రచారంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

## 100 ఎకరాల్లో గ్లోబల్ సమ్మిట్

**వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు**


**తరలి రానున్న పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు**

కందుకూరు, డిసెంబర్ 6 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' అజెండా ఖరారైంది. ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సు నిర్వహణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తరలి వస్తారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు సిద్ధమవుతున్నాయి. సదస్సు రెండో రోజు సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, గుత్తా జ్వాల పాల్గొననున్నారు. క్రియేటివ్ సెషన్‌లో రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గునీత్ మోంగా, అనుపమ చోప్రా పాల్గొంటారు.

# పరకామణి చోరీ చిన్న దొంగతనమా?

## సెటిల్ చేయడానికి జగన్ ఎవరు?.. ఏపీ సీఎం చంద్రబాబు ఫైర్

అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి పరకామణి చోరీని 'చిన్న దొంగతనం'గా అభివర్ణిస్తూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని, జగన్‌కు దేవుడన్నా, భక్తులన్నా, ఆలయాల పవిత్రత అన్నా ఏమాత్రం లెక్కలేదని మండిపడ్డారు. శనివారం నాడు అమరావతి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. "బాబాయి హత్యనే సెటిల్ చేసుకుందామని చూసిన వ్యక్తి, ఇప్పుడు పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూడటం కంటే ఘోరం ఉంటుందా?" అని చంద్రబాబు ప్రశ్నించారు. దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి చెల్లించాడు కదా, తప్పేముందని జగన్ వాదించడం అనైతికమని అన్నారు. "భక్తులు ఎంతో భక్తితో సమర్పించిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్మెంట్ ఏంటి? రూ.72 వేలు అనేది చిన్న మొత్తమే కావచ్చు, కానీ దేవుడి హుండీలో చోరీ చేయడం చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా?" అని చంద్రబాబు నిలదీశారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడటం ఘోరమని, జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి మొహమాటాలకు తావులేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను సైతం నేరమయం చేసిందని, నేరస్తులను పెంచి పోషించిందని ఆరోపించారు. నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. "ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు, విజయనగరం లాంటి జిల్లాల్లో గతంలో ఎలాంటి అధికారులను ఎస్పీలుగా నియమించినా సరిపోయేది. కానీ గత ఐదేళ్ల పాలనలో అక్కడ కూడా నేరస్తులు తయారయ్యారు. నెల్లూరులో ఏకంగా లేడీ డాన్లను తయారు చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సంస్కృతిని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. నేరస్తులను ఏరివేస్తాం, రౌడీలను అణిచివేస్తాం" అని హెచ్చరించారు. రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, దీంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఇటీవల తాను రైతులతో నిర్వహించిన సమావేశం సత్ఫలితాలనిచ్చిందని, రెండో దశ భూసమీకరణకు కూడా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, ప్రభుత్వం సంతోషంగా ఉంటే కొందరికి మాత్రం కడుపు మండుతోందని పరోక్షంగా విమర్శించారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' ఒక బ్రాండ్‌గా మారిందని, విద్యాశాఖలో నారా లోకేశ్ తీసుకువస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చంద్రబాబు వివరించారు.





# చెవిరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

## మరో నలుగురి పిటిషన్లు కూడా.. లిక్కర్ స్కామ్ కేసులో ఎదురుదెబ్బ

విజయవాడ, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి న్యాయస్థానంలో మరోసారి నిరాశే ఎదురైంది. ఆయనతో పాటు మరో ముగ్గురు నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. అదే సమయంలో వీరి జ్యుడీషియల్ రిమాండ్‌ను ఈ నెల 19వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై న్యాయాధికారి భాస్కరరావు విచారణ చేపట్టారు. ఈ దశలో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని ప్రాసిక్యూషన్ తరపున జేడీ



రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. నిందితుల పాత్రపై లోతుగా విచారణ జరుపుతున్నామని, కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. అలానే, నిందితుల రిమాండ్ గడువు ముగియడంతో పోలీసులు వారిని విజయవాడ, గుంటూరు జైళ్ల నుంచి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ అభ్యర్థన మేరకు వారికి డిసెంబర్ 19 వరకు రిమాండ్ పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులిచ్చారు. అనంతరం వారిని తిరిగి కారాగారాలకు తరలించారు. ఇదే కేసులో బెయిల్‌పై ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి, పైలా దిలీప్ కోర్టుకు హాజరు కాలేదు. వారి తరఫు న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. ఇదే కేసులో మనీ రూటింగ్ ఆరోపణలతో అరెస్టయిన రోణక్ కుమార్‌కు జైల్లో ఇంటి భోజనం, దోమతెర ఏర్పాటు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. దీనిపై ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించిన న్యాయమూర్తి, విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## ఎకో టూరిజం ద్వారా గిరిజనులకు ఆదాయం

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కీలక ఆదేశాలు

వైజాగ్, డిసెంబర్ 6 (ఈవార్తలు): అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనుల ఆదాయ మార్గాలను పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. గిరిజన అభివృద్ధి, ఎకో టూరిజం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అటవీ, ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వాటి తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గిరిజనుల ఆదాయాన్ని గణనీయంగా పెంచవచ్చని పవన్ తెలిపారు. అదేవిధంగా, ఏజెన్సీలోని జలపాతాలు, అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి ఎకో టూరిజం ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూరుతుందని, ఏజెన్సీలో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల్లో సినిమా, ఓటీటీ ప్రాజెక్టుల షూటింగ్‌లను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. గంజాయి సాగు నిర్మూలన అంశంపై కూడా సమీక్షించిన పవన్, గిరిజనులు ఆ వైపు వెళ్లకుండా వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ప్రతి నెలా నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. అధికారుల సమన్వయంతో గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## బాగా పనిచేస్తున్నావ్!

### లోకేశ్‌కు పవన్ అభినందనలు

అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే ధృడ సంకల్పంతో లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని, నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సంస్కరణల ప్రక్రియలో తల్లితండ్రులను, ఉపాధ్యాయులను భాగస్వాములను చేసేందుకు నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్స్' ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. ఇటువంటి సమావేశాల్లో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మంత్రిగా లోకేశ్ చూపుతున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నిన్న ఏపీ వ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్స్ జరగడం తెలిసిందే. చిలకలూరిపేటలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ లో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. అందుకు గాను పవన్ కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో స్పందిస్తూ పవన్ కల్యాణ్ పై విధంగా అభినందనలు తెలిపారు.

## జగిత్యాల జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ అధ్యక్షుడిగా కుసుమ శంకర్

పెగడపల్లి, డిసెంబర్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కుసుమ శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగిత్యాలలోని భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా పెగడపల్లికి చెందిన కుసుమ శంకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు.

## బుద్ధిమంతులుగా ఏపీ ఎంపీల నటన

### ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం



విజయవాడ, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసం పనిచే స్తున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపకుండా, బీజేపీకి బినామీలుగా, మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎంపీల వైఖరిపై ఆమె మండిపడ్డారు. షర్మిల స్పందిస్తూ, "రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా, విభజన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. పార్లమెంటులో మన ఎంపీలు బుద్ధిమంతుల్లా కూర్చుంటున్నారు. మోదీ మాట్లాడితే చప్పట్లు కొట్టడానికి పోటీ పడుతున్నారు. వారికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ముఖ్యమయ్యాయి. పేరుకు వేర్వేరు పార్టీల ఎంపీలు అయినా, వారంతా బీజేపీకి రబ్బర్ స్టాంపుల్లా మారిపోయారు. బీజేపీ ప్రవేశపెట్టే బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప వారికి ఏమీ చేతకావడం లేదు" అని విమర్శించారు. విభజన హామీలను ప్రజలకు ఇచ్చిన చెక్కుతో పోల్చిన షర్మిల, "2014 నాటికే విభజన హామీల విలువ రూ. 5 లక్షల కోట్లు. ఆ చెక్కు మన చేతిలో ఉన్నా, దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేని దుస్థితిలో ఉన్నాం. పోలవరం ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తున్నా, అమరావతికి కేంద్రం సాయం చేయలేదని పార్లమెంటరీ కమిటీ చెప్పినా, మన ఎంపీలు మౌనంగా ఉండి గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారు" అని ఎద్దేవా చేశారు. "రాష్ట్రంలో 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు... మీరు నిజంగా తెలుగు బిడ్డలే అయితే, మీలో ప్రవహించేది తెలుగు వాడి రక్తమే అయితే, మీకు ఓట్లు వేసిన ప్రజల మీద కృతజ్ఞత ఉంటే, ఇప్పటికైనా విభజన హామీలపై నోరు విప్పండి. ప్రధాని మోదీ మోసాలను పార్లమెంటు వేదికగా నిలదీయండి" అని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

## పవన్ వ్యాఖ్యలు దురదృష్టకరం: ఉండవల్లి



రాజమండ్రి, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవుతారని తాను బలంగా విశ్వసించానని, కానీ ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. "కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలింది" అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఉండవల్లి.. పవన్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. "డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత అనుచితం. పవన్ ఇలా మాట్లాడటం బాధాకరం. నేను సీఎం అవుతాడని నమ్మిన వ్యక్తి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వినాల్సి రావడం నిజంగా దురదృష్టకరం" అని ఉండవల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా ఉండవల్లి విమర్శలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్న చంద్రబాబు... తన సొంత వ్యాపారాలను, నివాసాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు మార్చడం లేదని నిలదీశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కేవలం వైసీపీని ఓడించాలనే ఏకైక లక్ష్యంతోనే ఏర్పడిందని, అందుకే విజయం సాధించిందని ఉండవల్లి విశ్లేషించారు. ఈ పొత్తు ఎంతకాలం కొనసాగుతుందో చూడాలని ఆయన వ్యాఖ్యానించారు.

## ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా విక్రమ్ పూల

అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన అధ్యక్షుడిగా పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల) నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నియామకంతో పాటు అధికార భాషా సంఘం నిర్వర్తించాల్సిన కీలక బాధ్యతలను, కార్యాచరణను కూడా ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ఆంగ్ల భాష వాడకాన్ని నియంత్రించి, తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు వాడకం ఏ స్థాయిలో ఉందో తనిఖీలు చేసే అధికారాన్ని సంఘానికి కల్పించింది. తనిఖీల అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొంది. తెలుగు భాష వినియోగంలో సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అధికార భాషాభివృద్ధికి అవసరమైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివరించింది.

## 10 నుంచి భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం శనివారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు డిసెంబర్ 10న ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ చర్చలకు అమెరికా తరఫున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొంటున్నారు. భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అమెరికా ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత సెప్టెంబర్ 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ బృందం చర్చల కోసం అమెరికాకు వెళ్లింది. త్వరలో అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇటీవల తెలిపారు. భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాలను ప్రస్తావిస్తామని ఆయన వెల్లడించారు. టారిఫ్‌ల సమస్యను పరిష్కరించేందుకు ఒకసారి, పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు ఉంటాయని తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి వాణిజ్య చర్చలు పూర్తి చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## దమ్ముంటే అసెంబ్లీకి రా జగన్

### తేల్చుకుందాం: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని సవాల్ విసిరారు. బయట ఉండి నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది అసెంబ్లీలో అని, వీధుల్లో కాదని హితవు పలికారు. "జగన్ రెడ్డి కి నా సవాల్! బయటి రోడ్లపైన, కేసుల మాటున జైలు ఆవరణలో, లేక ప్యాలెస్‌లలో కూర్చుని అసంబద్ధమైన ఆరోపణలు చేయడం, నిరాధారమైన గందరగోళపు ప్రచారాలు సృష్టించడం మీ విధ్వంసక సిద్ధాంతం కావచ్చు. కానీ, ప్రజలు ఎన్నుకున్న మాకు చట్టంపై, రాజ్యాంగంపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై పూర్తి గౌరవం ఉంది. మాకు 'గుండాయిజం' తెలియదు... దోపిడీలు, దొంగతనాల చరిత్ర లేదు... అక్రమ సంపాదన, అడ్డగోలు కేసుల సంస్కృతి మాకు అలవాటు లేదు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో మాకు తెలిసింది కేవలం సుపరిపాలన, అభివృద్ధి, మరియు ప్రజా సమస్యలపై పారదర్శక చర్చ. మీకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే... ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు గురించి, ప్రజల సమస్యలపై మా ప్రభుత్వంతో నిజాయతీగా చర్చించే చిత్తశుద్ధి ఉంటే... అసెంబ్లీలో అడుగు పెట్టండి! అక్కడే చర్చిద్దాం! అక్కడే తేల్చుకుందాం! ప్రజా సమస్యలకు అసెంబ్లీ వేదిక కావాలి, వీధులు కాదు! జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. ఇప్పుడు ప్రతిపక్ష నేత హోదా ప్రజలు ఇవ్వకపోయినా కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మీ నాయకులను అదుపులో ఉంచలేక, పదేపదే అరాచకానికి పాల్పడాలని వారిని ప్రేరేపిస్తున్నారు. మీ నేతలు చేస్తున్న అసంబద్ధ విమర్శలకు అసెంబ్లీలో జవాబు చెప్పగలరా? గత ఐదేళ్ల నీ అసమర్థ పాలనలో ప్రజాధనాన్ని, సమయాన్ని వృథా చేసిన మీ నేతలు నేడు కూటమి ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలు, అసత్య ప్రచారాలకు ప్రజలకు జవాబు చెప్పే ధైర్యం మీకు ఉందా? చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పడానికి సిద్ధంగా ఉంది. చర్చకు రండి!" అని అచ్చెన్నాయుడు ట్వీట్ చేశారు.

## జగన్ మాఫియా నాయకుడు: ఆనం



అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ పై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ ఒక మాఫియా నాయకుడే తప్ప, ఎప్పటికీ రాజకీయ నాయకుడు కాలేరని తీవ్రంగా దుయ్యబట్టారు. తిరుమల శ్రీవారి సొమ్మును కూడా దోచుకున్నారని, దొంగే దొంగ అని అరిచినట్టుగా జగన్ ప్రవర్తన ఉందని ఆయన మండిపడ్డారు. ఈరోజు ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనం మాట్లాడారు. తిరుమల పరకామణిలో కేవలం 9 నోట్లు దొంగిలించిన కేసులో రూ.14 కోట్లకు ఎలా రాజీ కుదిర్చారని జగన్‌ను ప్రశ్నించారు. వందల కోట్ల విలువైన ఆస్తులను వైసీపీ నేతల పేర్ల మీద రాయించుకుని, లోక్ అదాలత్‌లో రాజీ చేయించారని ఆరోపించారు. వీడియో సాక్ష్యాలున్నా దీన్ని చిన్న దొంగతనమని జగన్ కొట్టిపారేయడం విడ్డూరంగా ఉందన్నారు. "దేవుడి సొమ్ము దోచిన దొంగను దోచుకుని, ఆ దొంగలకే పెద్దన్నలా నిలిచిన వ్యక్తి జగన్" అని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కూడా ఆనం ప్రస్తావించారు. ఒక్క చుక్క పాలు కూడా లేకుండా నెయ్యి తయారు చేయడం ప్రపంచంలోనే 9వ వింత అని ఎద్దేవా చేశారు. ఈ కల్తీ నెయ్యికి టెండర్లు పిలిచి, కొనుగోలు ఆర్డర్ ఇచ్చింది వైసీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ వ్యవహారాన్ని గుర్తించి చర్యలు తీసుకుందని తెలిపారు. ఐదేళ్ల పాలనలో జగన్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని డ్రగ్స్, లిక్కర్, భూ మాఫియాలను పెంచి పోషించారని ఆనం ఆరోపించారు. దొంగ చేతికి అధికారం ఇస్తే ఏమవుతుందో జగన్ పాలనే నిదర్శనమని విమర్శించారు. ప్రజలను, రాష్ట్రాన్ని దోచుకుని చివరికి దేవుడిని కూడా వదల్లేదని, ఇప్పటికైనా జగన్ స్వామివారికి క్షమాపణ చెప్పాలని సూచించారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాలయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారని, తిరుమలలో మాఫియా ప్రమేయాన్ని పూర్తిగా తొలగిస్తామని ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## ఏపీలోని పట్టణాలకు 281 కోట్లు

అమరావతి, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, పది లక్షల లోపు జనాభా ఉన్న (నాన్-మిలియన్ ప్లస్) నగరాలకు రెండో విడత గ్రాంట్‌గా రూ. 281.89 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. ఈ నిధులను ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించనున్నారు. ముఖ్యంగా రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విడుదలైన నిధులను "టైడ్" మరియు "అన్-టైడ్" గ్రాంట్ల రూపంలో కేటాయించారు. ఈ విధానం వల్ల ప్రతి పట్టణం తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను ఖర్చు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఏయే పనులకు ఎంత మొత్తం కేటాయించాలనేది స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయిస్తారు. ఈ నిధుల విడుదలతో రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పట్టణాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నిధుల వినియోగానికి మార్గం సుగమమైంది.

## పాట్నాలో శ్రీవారి ఆలయం

పాట్నా: బీహార్ రాజధాని పాట్నాలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఆలయ నిర్మాణం కోసం భూమిని కేటాయించేందుకు బీహార్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు పాట్నాలోని మోకామా ఖాస్ ప్రాంతంలో 10.11 ఎకరాల భూమిని కేటాయించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఒక్క రూపాయి టోకెన్ లీజు రెంట్‌పై 99 సంవత్సరాల పాటు ఈ భూమిని టీటీడీకి లీజుకు ఇవ్వనున్నారు. బీహార్ ప్రభుత్వ నిర్ణయం పట్ల బీఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై అభినందనలు తెలిపిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీహార్ ప్రభుత్వ దూరదృష్టికి, సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఒప్పందం కోసం బీహార్ పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌ను అధికారికంగా నియమించారని బీఆర్ నాయుడు వివరించారు.



# పూరీ ఆలయానికి వేల కోట్ల భూములు

పాట్నా: ఒడిశాలోని పూరి జగన్నాథ ఆలయానికి రాష్ట్రంలో 60,426 ఎకరాల భూమి ఉండగా, మరో ఆరు రాష్ట్రాల్లో దాదాపు 400 ఎకరాల భూమి ఉందని ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం శాసనసభలో వెల్లడించారు. బీజేడీ ఎమ్మెల్యే సుదర్శన్ హరిపాల్ శాసనసభలో అడిగిన ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు తెలియజేశారు. పూరిలోని ఈ 12వ శతాబ్దపు ఆలయాన్ని శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1956 ప్రకారం న్యాయశాఖ నిర్వహిస్తుంది. ఒడిశాలోని 24 జిల్లాల్లో జగన్నాథుని పేరు మీద 60,426.94 ఎకరాల భూమి ఉండగా, పశ్చిమ బెంగాల్ (322.93 ఎకరాలు), మహారాష్ట్ర (28.21 ఎకరాలు), మధ్యప్రదేశ్ (25.11 ఎకరాలు), ఆంధ్రప్రదేశ్ (17.02 ఎకరాలు), ఛత్తీస్‌గఢ్ (1.7 ఎకరాలు), బీహార్ (0.27 ఎకరాలు) లతో కలుపుకుని ఇతర ఆరు రాష్ట్రాలలో మరో 395.25 ఎకరాల ఆలయ భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 38,061.792 ఎకరాలకు సంబంధించిన సవరించిన భూమి రికార్డులు పూరిలోని శ్రీ జగన్నాథ ఆలయ అధికారుల వద్ద ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆలయ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నట్లు అనేక కేసులు వెలుగులోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆక్రమణలో ఉన్న 169 ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు శ్రీ జగన్నాథ ఆలయ చట్టం కింద మొత్తం 974 కేసులు నమోదు చేసినట్లు ఆయన సభకు తెలియజేశారు.

## ఇండిగో దెబ్బ..
### హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, డిసెంబర్ 6 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా ఇండిగో విమానాలు పెద్ద సంఖ్యలో రద్దు కావడంతో విమానాశ్రయాల్లో నిలిచిపోయిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు భారతీయ రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 37 ప్రీమియం రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లకు అదనంగా 116 కోచ్‌లను జత చేస్తున్నట్లు తెలిపింది. దీని ద్వారా మొత్తం 114 అదనపు ట్రిప్పులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. సికింద్రాబాద్–చెన్నై, చర్లపల్లి–కోల్‌కతా, హైదరాబాద్–ముంబై మార్గాల్లో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. తెలంగాణ ఆర్టీసీ సైతం శంషాబాద్ విమానాశ్రయం నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. చెన్నైకి ఒక్కొక్కరికి రూ.2,110, బెంగళూరుకు రూ.1,670 ఛార్జీ వసూలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం వైపు కూడా అదనపు బస్సులను నడుపుతున్నారు. సౌత్ వెస్ట్ రైల్వే, సెంట్రల్, సౌత్ ఈస్టర్న్, సదర్న్ రైల్వే కూడా అదనపు రైళ్లను ప్రకటించాయి. డిసెంబర్ 6 నుంచి 10వ తేదీ మధ్య బెంగళూరు–చెన్నై, బెంగళూరు–పుణే, యశ్వంతపూర్–హజ్రత్ నిజాముద్దీన్, శాలిమార్–యెలహంక, ఎర్నాకులం–యెలహంక మార్గాల్లో రైళ్లు నడపనున్నట్లు సౌత్ వెస్ట్ రైల్వే తెలిపింది.

## ‘ఎస్ఐఆర్’లో తప్పుడు వివరాలు
### ఉత్తరప్రదేశ్‌లో తొలి కేసు నమోదు

రాంపూర్: ఉత్తరప్రదేశ్ పోలీసులు ఓటరు జాబితా నవీకరణ (ఎస్ఐఆర్) సమయంలో సమర్పించిన ఫారమ్‌లలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఒక కుటుంబంపై మొట్టమొదటిసారిగా కేసు నమోదు చేశారు. రాంపూర్‌కు చెందిన ఒక సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు, బీఎన్ఎస్ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది. రాంపూర్ నివాసితురాలైన నూర్జహాన్, ఆమె ఇద్దరు కుమారులు అమీర్ ఖాన్, డానిష్ ఖాన్ చాలాకాలంగా దుబాయ్, కువైట్‌లలో నివసిస్తున్నారు. ఓటరు జాబితా నవీకరణ కోసం చేపట్టిన ఫారమ్‌లో నూర్జహాన్ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఆమె తన కుమారులు రాంపూర్‌లోనే నివసిస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా, ఫోర్జరీ చేసిన సంతకాలు కలిగిన పత్రాలను బూత్ స్థాయి అధికారికి సమర్పించింది. ఎస్ఐఆర్ వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్న సమయంలో నూర్జహాన్ ఇచ్చిన సమాచారం తప్పు అని అధికారులు గుర్తించారు. ఆమె తన కుమారుల సంతకాలను ఫోర్జరీ చేసిందని కూడా గ్రహించారు. ఈ నేపథ్యంలో నూర్జహాన్ కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ‘ఎస్ఐఆర్’ ప్రక్రియలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు కేసు నమోదు కావడం దేశంలోనే ఇది మొదటిసారి.

# మోదీ-పుతిన్ భేటీపై అమెరికా ఫోకస్

### ఇరువురి భేటీపై అక్కడి ప్రత్యేక కథనాలు



వాషింగ్టన్: ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఢిల్లీలో జరిగిన శిఖరాగ్ర సమావేశంపై అమెరికాలోని ప్రముఖ మీడియా సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. రష్యా, పాశ్చాత్య దేశాల మధ్య భారత్ అనుసరిస్తున్న వ్యూహాత్మక సమతుల్యతకు ఈ భేటీ ఒక పరీక్ష అని విశ్లేషించాయి. ఇంధనం, రక్షణ సంబంధాలు, వాషింగ్టన్ నుంచి వస్తున్న ఒత్తిళ్ల నడుమ ఇరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత బంధం ఈ పర్యటనను ఎలా ప్రభావితం చేసిందో తమ కథనాల్లో వివరించాయి. ‘వాల్ స్ట్రీట్ జర్నల్’ తన కథనంలో రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా ద్వితీయ శ్రేణి ఆంక్షల ఒత్తిడి పెరుగుతున్న సమయంలో ఈ భేటీ జరిగిందని పేర్కొంది. ఇంధన భాగస్వామ్యంపై ఒత్తిడి ఉన్నప్పటికీ, రష్యా నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని పుతిన్ హామీ ఇచ్చారని, ఇంధన భద్రత ఇరు దేశాల మధ్య బలమైన అంశమంటూ మోదీ అభివర్ణించారని తెలిపింది. ‘వాషింగ్టన్ పోస్ట్’ ప్రకారం.. ఈ సమావేశం భారత్ విదేశాంగ విధానంలో ఒక కీలక ఘట్టం. ఉక్రెయిన్ శాంతి చర్చల కోసం వాషింగ్టన్ ఒత్తిడి తెస్తున్నప్పటికీ, మాస్కోతో పాత సంబంధాలను కొనసాగించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది నిదర్శనమని పేర్కొంది. పుతిన్‌కు మోదీ ఆత్మీయ ఆలింగనంతో స్వాగతం పలకడాన్ని, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని ఈ కథనం హైలైట్ చేసింది. ఇక ‘న్యూయార్క్ టైమ్స్’ ఇరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత సంబంధాన్ని నొక్కి చెప్పింది. పుతిన్‌తో తనది విడదీయరాని లోతైన బంధం అని మోదీ చెప్పారని, భారత్–రష్యా మైత్రిని ధ్రువతారతో పోల్చారని గుర్తుచేసింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ కూడా భారత్ తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని చాటుకుందని విశ్లేషించింది. చైనాపై అతిగా ఆధారపడకుండా ఉండేందుకు రష్యాకు భారత్ ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోందని నిపుణుల అభిప్రాయాలను ఉటంకించింది.మొత్తం మీద, అమెరికా మీడియా కథనాలన్నీ ఒకే విషయాన్ని స్పష్టం చేశాయి. భారత్ ఒకే సమయంలో తన ఇంధన ప్రయోజనాలను కాపాడుకుంటూ, వాషింగ్టన్ ఒత్తిడిని ఎదుర్కొంటూ, మాస్కోతో చారిత్రక సంబంధాలను కొనసాగించడానికి ప్రయత్నిస్తోందని విశ్లేషించాయి.

## బీజేపీ ఎమ్మెల్యే 3 కిలోమీటర్ల సాష్టాంగ నమస్కారం

ముంబై: మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే అభిమన్యు పవార్ శనివారం స్థానిక చక్కెర కర్మాగారం నుండి అక్కడి నీలకంఠేశ్వర్ ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర సాష్టాంగ ప్రణామాలు చేసి మొక్కు తీర్చుకున్నారు. స్థానికంగా చక్కెర కర్మాగారం పునఃప్రారంభానికి సంబంధించి తన కోరిక నెరవేరడంతో ఆయన మొక్కు తీర్చుకున్నారు. లాతూర్ జిల్లాలోని కిల్లారి గ్రామంలో ఏళ్ల తరబడి రైతుల ఆధ్వర్యంలోని ఒక చక్కెర కర్మాగారం మూతబడి ఉంది. యంత్రాలు అరిగిపోయి, మౌలిక సదుపాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆగస్టులో ఆయన నీలకంఠేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. చక్కెర పరిశ్రమ మళ్లీ అందుబాటులోకి వస్తే సాష్టాంగ ప్రణామాలు చేస్తానని మొక్కుకున్నారు. ఇటీవల ఈ కర్మాగారం ప్రారంభమవడంతో, ఆయన కర్మాగారం నుంచి ఆలయం వరకు సాష్టాంగ ప్రణామాలతో వచ్చారు. .

## పురుషుడిపై మహిళ అత్యాచారం

పూణె: మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు . ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, “నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను” అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## భార్య బెదిరింపులు క్రూరత్వమే
### ఛత్తీస్‌గఢ్ హైకోర్టు కీలక తీర్పు

రాయ్‌పూర్: భార్య పదేపదే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం, మతం మారాలని ఒత్తిడి చేయడం భర్తపై మానసిక క్రూరత్వం కిందకే వస్తుందని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి ప్రవర్తన విడాకులకు బలమైన కారణంగా నిలుస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకులను సమర్థిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బలోద్ జిల్లాకు చెందిన దంపతులకు 2018 మే నెలలో వివాహమైంది. అయితే, పెళ్లయిన కొంత కాలానికే భార్య ఆత్మహత్య బెదిరింపులకు పాల్పడటం మొదలుపెట్టింది. పాయిజన్ తాగడం, కత్తితో పొడుచుకోవడం, కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోవడం వంటి ప్రయత్నాలు చేసిందని, దీంతో తాను నిత్యం భయంతో బతకాల్సి వచ్చిందని భర్త 2019 అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జస్టిస్ రజనీ దూబే, జస్టిస్ అమితేంద్ర కిషోర్ ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. క్రూరత్వం అంటే కేవలం శారీరక హింస మాత్రమే కాదని, భాగస్వామి మనసులో భయాన్ని కలిగించే ప్రవర్తన కూడా దాని కిందకే వస్తుందని కోర్టు అభిప్రాయపడింది. భార్య ఆత్మహత్య బెదిరింపుల కారణంగానే ఆమెను పుట్టింట్లో వదిలిపెట్టినట్లు భర్త విచారణలో అంగీకరించిన విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. దీంతో పాటు, ఇస్లాం మతంలోకి మారాలని భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనపై ఒత్తిడి తెచ్చారని భర్త ఆరోపించాడు. దీనికి సంబంధించిన సాక్ష్యాన్ని కూడా కోర్టు నమోదు చేసింది. 2019 నవంబర్ నుంచి ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారని, తిరిగి కాపురానికి వచ్చేందుకు భార్య ఆసక్తి చూపలేదని కోర్టు నిర్ధారించింది. భార్య ప్రవర్తన చట్ట ప్రకారం క్రూరత్వంగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తూ, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకుల తీర్పును సమర్థించి, ఆమె అప్పీల్‌ను కొట్టివేసింది.

## మోదీ సాయం కోరిన పాక్ మహిళ
### భర్త తనను కరాచీలో వదిలేశాడని వెల్లడి.. రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని ఆరోపణ

ఇస్లామాబాద్: తన భర్త తనను పాకిస్థాన్‌లో వదిలేసి, రహస్యంగా ఢిల్లీలో మరో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఓ పాకిస్థానీ మహిళ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. కరాచీకి చెందిన నికితా నాగ్‌దేవ్ అనే మహిళ, తన భర్త విక్రమ్ నాగ్‌దేవ్‌పై ఈ తీవ్ర ఆరోపణలు చేశారు. నికితా కథనం ప్రకారం, ఇండోర్‌లో దీర్ఘకాలిక వీసాపై నివసిస్తున్న పాకిస్థాన్ మూలాలున్న విక్రమ్ నాగ్‌దేవ్‌తో ఆమెకు 2020 జనవరి 26న కరాచీలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. పెళ్లైన నెల తర్వాత, ఫిబ్రవరి 26న ఆమెను భారత్‌కు తీసుకొచ్చారు. అయితే, కొన్ని నెలలకే ‘వీసాలో సాంకేతిక సమస్య’ ఉందని చెప్పి, 2020 జూలై 9న అటారీ సరిహద్దు వద్ద తనను బలవంతంగా పాకిస్థాన్‌కు పంపించేశాడని ఆమె ఆరోపించారు. అప్పటి నుంచి తనను తిరిగి భారత్‌కు పిలిపించుకోవడానికి విక్రమ్ నిరాకరిస్తున్నాడని ఆమె వాపోయారు. పెళ్లై అత్తారింటికి వచ్చిన కొద్ది రోజులకే వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందని నికిత తెలిపారు. తన భర్తకు తన బంధువుల్లో ఒకరితో వివాహేతర సంబంధం ఉందని తెలిసిందని, ఈ విషయం మామగారికి చెబితే, ‘అబ్బాయిలకు ఇలాంటివి సహజం, ఏమీ చేయలేం’ అని అన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఈ రోజు నాకు న్యాయం జరగకపోతే, న్యాయవ్యవస్థపై మహిళలకు నమ్మకం పోతుంది. దయచేసి నాకు అండగా నిలవండి” అని ఆమె కరాచీ నుంచి విడుదల చేసిన వీడియోలో వేడుకున్నారు. తన భర్త ఢిల్లీకి చెందిన మరో మహిళను పెళ్లి చేసుకోబోతున్నాడని తెలియడంతో నికిత 2025 జనవరి 27న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసు మధ్యప్రదేశ్ హైకోర్టుచే అధికారం పొందిన సింధీ పంచ్ మధ్యవర్తిత్వ, న్యాయ సలహా కేంద్రం ముందుకు వచ్చింది. విచారణ అనంతరం మధ్యవర్తిత్వం విఫలమైంది. భార్యాభర్తలిద్దరూ భారత పౌరులు కానందున, ఈ కేసు పాకిస్థాన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, విక్రమ్‌ను పాకిస్థాన్‌కు బహిష్కరించాలని ఆ కేంద్రం 2025 ఏప్రిల్ 30న సిఫార్సు చేసింది. గతంలో 2025 మే నెలలో ఇండోర్ సోషల్ పంచాయితీ కూడా విక్రమ్‌ను దేశం విడిచి పంపాలని సిఫార్సు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ ఈ విషయంపై విచారణకు ఆదేశించినట్లు ధృవీకరించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## ఇండిగోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
### కేంద్ర ప్రభుత్వానికి నారాయణ కీలక సూచన

విజయవాడ, డిసెంబర్ 6 (ఈవార్తలు): ఇండిగో విమాన సర్వీసుల తీవ్ర అంతరాయంపై సీపీఐ నేత నారాయణ స్పందించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ఆయన ఒక కీలక సూచన చేశారు. ఇండిగో సర్వీసులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అన్నారు. గత ఐదు రోజులుగా ఇండిగో విమానాల సేవల్లో అంతరాయం కొనసాగుతున్న విషయం తెలిసిందే. శనివారం కూడా పలు విమానాశ్రయాల్లో దాదాపు 500కు పైగా దేశీయ విమానాలు రద్దయ్యాయి. ఈ సర్వీసులలో అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. అందుకే ఇండిగోను కేంద్రం స్వాధీనం చేసుకుని నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, అందుకే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ విమానయానంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## సుప్రీంలో ‘ఇండిగో’ పిటిషన్
### ఎయిర్‌పోర్టుల్లో మానవతా సంక్షోభం అన్న పిటిషనర్
### తక్షణమే జోక్యం చేసుకోవాలని కోర్టుకు అభ్యర్థన

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ‘ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్’ పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యం కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో ‘మానవతా సంక్షోభం’ తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వృద్ధులు, పసిపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారితో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీరు, విశ్రాంతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌరుల జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు తీవ్ర విఘాతం కలిగించడమేనని తెలిపారు. పైలట్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన విమాన డ్యూటీ సమయ పరిమితి నిబంధనల అమలులో ప్రణాళిక లోపం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడ్డాయని ఇండిగో బహిరంగంగా అంగీకరించింది. అయితే, ఈ మార్పులను ముందుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ఇండిగోతో పాటు డీజీసీఏ కూడా విఫలమయ్యాయని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కీలక మార్గాల్లో టికెట్ ధరలను రూ.50,000 వరకు పెంచి ప్రయాణికులను బందీలుగా మార్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విమానాల రద్దు వల్ల చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఇతర విమానాల్లో లేదా రైళ్లలో ఉచితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ఇండిగోను ఆదేశించాలని అభ్యర్థించారు. అలాగే డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు.

## డెడ్‌లిఫ్ట్‌లో ప్రగతి పసిడి మోత

ఇస్తాంబుల్: తెలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రగతి, అంతర్జాతీయ క్రీడా వేదికపై సత్తా చాటారు. 49 ఏళ్ల వయసులో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో ఏకంగా నాలుగు పతకాలు సాధించారు. డెడ్‌లిఫ్ట్ విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె విజయంపై సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు. టర్కీలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్స్ కేటగిరీలో పోటీపడిన ప్రగతి, తన కఠోర శ్రమకు తగ్గ ఫలితాన్ని అందుకున్నారు. డెడ్‌లిఫ్ట్‌లో స్వర్ణం, ఓవరాల్ పవర్‌లిఫ్టింగ్‌లో రజతం, బెంచ్ ప్రెస్, స్క్వాట్ లిఫ్ట్ విభాగాల్లోనూ రజత పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ విజయానందాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ రంగంలో సహాయ నటిగా రాణిస్తున్న ప్రగతి, కొన్నేళ్లుగా ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ పవర్‌లిఫ్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. 2023 నుంచి పోటీల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అనేక స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు.

### ప్రపంచం మందగమనం..
## మనది వృద్ధి: మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచం ఆర్థిక మందగమనం గురించి మాట్లాడుతున్న ప్రస్తుత తరుణంలో మన దేశం వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మహిళలు ప్రతి రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, భారతదేశ అభివృద్ధిలో నారీశక్తి పాత్ర గణనీయంగా పెరిగిందని, దీని ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. వలస పాలన నాటి మూలాలను పూర్తిగా వదిలించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారతదేశం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వృద్ధి ఇంజిన్‌గా భారత్ ఎదుగుతోందని మోదీ పేర్కొన్నారు.

## డీకేకు ఈవోడబ్ల్యూ నోటీసులు

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు చాలాకాలంగా నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు.

# ప్రత్యేక పరిస్థితుల్లో ఇండియాకు హసీనా: జైశంకర్



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఉండటం పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని, ఆమె దేశానికి రావడానికి దారితీసిన ‘ప్రత్యేక పరిస్థితులే’ ఈ విషయంలో కీలక పాత్ర పోషించాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఈరోజు జరిగిన హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో జరిగిన భారీ హింసాత్మక ఘటనల నేపథ్యంలో, 15 ఏళ్ల పాటు సాగిన షేక్ హసీనా పాలన ముగిసింది. ఆ సమయంలో ఆమె భారత్‌కు పారిపోయి వచ్చారు. కాగా, గతేడాది జరిగిన విద్యార్థి నిరసనలపై ఆమె ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించిందన్న ఆరోపణలతో, ‘మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు’ పాల్పడ్డారని నిర్ధారిస్తూ ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్ గత నెలలో ఆమెకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ‘ఆమె కోరుకున్నంత కాలం ఇక్కడ ఉండవచ్చా?’ అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, “ఆమె ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చారు. ఆమె భవిష్యత్తు విషయంలో ఆ పరిస్థితులే ఒక ముఖ్యమైన అంశం. అయితే, దీనిపై అంతిమ నిర్ణయం ఆమెనే తీసుకోవాలి” అని వివరించారు. ఇరు దేశాల సంబంధాలపై మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో విశ్వసనీయమైన ప్రజాస్వామ్య ప్రక్రియ జరగాలన్నదే భారత్ వైఖరి అని జైశంకర్ స్పష్టం చేశారు. “బంగ్లాదేశ్‌లోని ప్రస్తుత పాలకులు గత ఎన్నికల విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్నికలే సమస్య అయితే, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే మొదటి ప్రాధాన్యత కావాలి. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఏర్పడిన ప్రభుత్వం ఇరు దేశాల సంబంధాలపై సమతుల్య దృక్పథంతో ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను” అని ఆయన అన్నారు.

### భారత్-రష్యా స్నేహంపై ఎవరికీ వీటో లేదు

భారత్ తన భాగస్వాములను ఎంచుకునే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉందని, తమ దేశ సంబంధాలపై ఏ దేశానికీ ‘వీటో’ అధికారం లేదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజా భారత పర్యటన నేపథ్యంలో, ఈ పరిణామం అమెరికాతో సంబంధాలను క్లిష్టతరం చేస్తుందా? అన్న ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చారు. హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గడిచిన 70–80 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా అనేక భౌగోళిక, రాజకీయ మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, భారత్–రష్యా మధ్య సంబంధాలు అత్యంత స్థిరంగా కొనసాగాయని జైశంకర్ అన్నారు. ఇతర దేశాలతో రష్యాకు, అలాగే వేరే దేశాలతో భారత్‌కు సంబంధాలలో హెచ్చుతగ్గులు ఉన్నా, భారత్–రష్యా బంధం మాత్రం నిలకడగా ఉందని గుర్తుచేశారు. రష్యా పట్ల భారత ప్రజల్లో కూడా ఒక ప్రత్యేకమైన భావన ఉందని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానం అంటే ఇతరులను సంతోషపెట్టడం కాదని, దేశ ప్రయోజనాలకు అనుగుణంగా నిలబడటమని ఆయన గట్టిగా చెప్పారు. ప్రపంచంలో వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారం కొనసాగించడం, భాగస్వాములను ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉండటం భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని వివరించారు. అదే సమయంలో అమెరికాతో సంబంధాల విషయంలో ఎలాంటి సమాచార లోపం లేదని, త్వరలోనే వాషింగ్టన్‌తో కీలక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆ ఒప్పందం విషయంలో భారత రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వయ్యారి చిత్రం



మీనాక్షి దీక్షిత్




# సంక్రాంతికి సినిమా సంబురాలు




సంక్రాంతికి చిత్రాలను రిలీజ్ చేస్తే మంచి వసూళ్లను రాబట్టుకోవచ్చని మేకర్స్ యోచిస్తుంటారు. దీంతో ముందు నుంచే తమ సినిమాలు.. సంక్రాంతికి విడుదల అంటూ ప్రకటిస్తుంటారు.. కర్చీఫులు వేస్తుంటారు. అయితే ఏటా సంక్రాంతికి మాత్రం బాక్సాఫీస్ వద్ద కచ్చితంగా గట్టి పోటీ ఉంటుంది. అది కామన్ అయిపోయింది. ఈసారి కూడా అదే జరుగుతుంది. ఏకంగా ఏడు సినిమాలు.. సంక్రాంతి కానుకగా థియేటర్స్ లో విడుదల కానున్నాయి. టాలీవుడ్ హీరోలు చిరంజీవి, ప్రభాస్, రవితేజ, శర్వానంద్, నవీన్ పొలిశెట్టి వేర్వేరుగా లీడ్ రోల్స్ లో నటించిన చిత్రాలు పొంగల్ స్పెషల్ గా విడుదల కానున్నాయి. అదే సమయంలో కోలీవుడ్ హీరోలు విజయ్ దళపతి, శివ కార్తికేయన్ వేర్వేరుగా నటించిన సినిమాలు కూడా తెలుగు డబ్బింగ్ వెర్షన్ రూపంలో సందడి చేయనున్నాయి. అయితే ఇప్పుడు దాదాపు ఏడు సినిమాలు రిలీజ్ డేట్స్ కూడా ఖరారు అయినట్లు తెలుస్తోంది.

**సంక్రాంతి సినిమాలు ఇవే..**

- ది రాజా సాబ్- జనవరి 9
- జన నాయగన్- జనవరి 9
- మన శంకర వర ప్రసాద్ గారు- జనవరి 12
- భర్త మహాశయులకు విజ్ఞప్తి- జనవరి 13
- అనగనగా ఒక రాజు- జనవరి 14
- పరాశక్తి- జనవరి 14
- నారీ నారీ నడుమ మురారి- జనవరి 15









## రుక్మిణి కోసం స్టార్ హీరోల అర్రులు



కన్నడ భామ రుక్మిణి వసంత్ ఇప్పుడు సూపర్ ఫామ్ కొనసాగిస్తుంది. కాంతారా చాప్టర్ 1లో కనకావతి రోల్ లో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అన్నీ రుక్మిణికి మరింత పాపులారిటీ తెచ్చాయి. అందుకే అమ్మడికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఆల్రెడీ ఈ అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ప్రాజెక్ట్ లో నటిస్తుంది. ఈ సినిమాలో రుక్మిణికి కూడా మంచి రోల్ దక్కినట్టు తెలుస్తుంది. ఎన్టీఆర్ తర్వాత టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో జత కట్టే ఛాన్స్ ఉ ఒదని తెలుస్తుంది. అమ్మడికి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ ఏర్పడింది. రష్మిక, పూజా హెగ్డే లాంటి వాళ్లను వెనక్కి నెట్టి రుక్మిణి ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉంటుంది. అందుకే స్టార్స్ కూడా ఆమెకే ఓటేస్తున్నారు. రుక్మిణి వసంత్ ఎన్ టీ ఆర్ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం నెక్ట్స్ లిస్ట్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్ కూడా ఉన్నారని తెలుస్తుంది. సుకుమార్ చరణ్ కాంబినేషన్ సినిమాలో రుక్మిణి వసంత్ నే హీరోయిన్ గా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇక అల్లు అర్జున్, అట్లీ మూవీ తర్వాత నెక్ట్స్ సినిమాకు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉన్న రుక్మిణి వసంత్ నే తన సినిమాలో తీసుకోవాలనే ప్లానింగ్ ఉందట. సో రుక్మిణి ఈ కొత్త జోడీలు ఫ్యాన్స్ కి సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. ఐతే రుక్మిణి వసంత్ కేవలం స్టార్ హీరోలతోనే కాదు తెలుగులో మంచి లవ్ స్టోరీస్ చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు.



## అఖండ 2పై నేడు క్లారిటీ?

అఖండ 2 సందడి డిసెంబర్ 4వ తేదీన ప్రీమియర్స్ తో మొదలవ్వాల్సి ఉండగా.. వాయిదా పడింది కదా.. అయితే డిసెంబర్ 5వ తేదీన ప్రీమియర్స్ పడతాయని కొందరు ఎక్స్పెక్ట్ చేశారు. శనివారం అయినా సినిమా వస్తుందనుకున్నారు. కానీ అలాంటిదేం లేదని నిర్మాతలు వెల్లడించారు. త్వరలో బ్లాక్ బస్టర్ డేట్ తో వస్తామని చెప్పారు. కానీ రిలీజ్ డేట్ ను మాత్రం వెల్లడించలేదు. అయితే అసలు అఖండ 2 విషయంలో నెక్ట్స్ ఏంటి అని ఇప్పుడు అంతా మాట్లాడుకుంటున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24వ తేదీన రిలీజ్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. అందులో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని టాక్ వినిపిస్తోంది. మేకర్స్.. మరికొన్ని గంటల్లో అధికారికంగా అనౌన్స్ చేయనున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో రిలీజ్ డేట్ పై ప్రకటన స్పష్టంగా ఇవ్వాలంటే.. ముందు విడుదలపై స్టే కోర్టు ఎత్తివేయాలి. ఎందుకంటే మద్రాసు హైకోర్టు ఆదేశాల వల్లే సినిమా వాయిదా పడిన విషయం తెలిసిందే. బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈరోస్ ఎంటర్టైన్మెంట్స్.. తమకు రావాల్సిన బకాయిలు విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు విడుదలను నిలిపివేయాలని ఆదేశించింది.

## ప్రేమలో చీటింగ్ ప్రసవ వేదనతో సమానం: ఇంద్రజ

ప్రేమ మత్తులో కొందరు జీవితాన్నే కోల్పోతున్నారు. కన్నవారిని వదిలేసి ఒంటరిగా జీవిస్తున్నారు. మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజమైన ప్రేమలో ఇవన్నీ ఉత్పన్నమవుతోన్న ప్రధాన కారణాలుగా ఓ సర్వేలో కూడా తేలింది.



తాజాగా సీనియర్ నటి, హోస్ట్ ఇంద్రజ లవ్, బ్రేకప్ గురించి ఓ టాక్ షోలో స్పందించారు. కొంత మంది యువతీ, యువకులు ప్రేమ, బ్రేకప్ ను చాలా సులభంగా తీసు కుంటున్నారు. ఇలాంటి వాటిపై మీ అభిప్రాయం ఏంటి అని ప్రశ్నించంగా బిడ్డకు జన్మనిచ్చేటప్పుడు కలిగే ప్రసవ వేదన ( బాధ) ఎంత తీవ్రంగా ఉ ఒటుందో? ప్రేమలో మోసపోతే కలిగే బాధ కూడా అంతే స్థాయిలో ఉంటుందన్నారు. మోసానికి ఇక్కడ జెండర్ తో సంబంధం లేదు. ఆడ అయినా కావొచ్చు!మగ అయినా కావొచ్చు! ఎవరిదైనా మనసే. ఆ మనసును గాయ పరచడం అత్యంత పాపం. ఆ పెయిన్ భరించిన వాళ్లకి మాత్రమే తెలుస్తుంది. అలా మోసం చేసి వెళ్లిపోయిన వారికి పుట్ట గతులుండవు. పుట్టింది ప్రేమించడానికి కాదు..సాధించడానికి యువత ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రేమ అనేది జీవిత ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అన్నారు.

## గ్లామర్ గర్ల్ మానుషి చిల్లర్!

మానుషి చిల్లర్..ఈ పేరు చెబితే తెలుగు ప్రేక్షకులకు ఎక్కువగా తెలియకపోయినప్పటికీ వరుణ్ తేజ్ నటించిన ఆపరేషన్ వాలెంటైన్ మూవీ హీరోయిన్ అంటే అందరికీ ఇట్టే గుర్తుకొస్తుంది. మానుషి చిల్లర్ తెలుగులో చేసింది ఒక్క సినిమానే అయినప్పటికీ తన అందాలతో ఎంతోమందిని ఆకట్టుకుంది. అయితే అలాంటి ఈ బ్యూటీ తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో మెరిసింది. తాజాగా బాలీవుడ్ హంగామా అవార్డ్స్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. ఈ అవార్డ్స్ ఈవెంట్ కి ఎంతోమంది తారలు పాల్గొని ఈవెంట్ ని సక్సెస్ చేశారు. ఎంతోమంది సెలెబ్రిటీలకు బాలీవుడ్ హంగామా అవార్డ్స్ వరించాయి. అలా ఈ అవార్డ్స్ ఈవెంట్ లో మానుషి చిల్లర్ తన అందంతో అందరిని కట్టిపడేసింది.. మానుషి చిల్లర్ బాలీవుడ్ హంగామా అవార్డ్స్ ఈవెంట్ లో చాలా స్టైలిష్ గా కనిపించడంతోపాటు తాను వేసుకునే డ్రెస్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. మానుషి చిల్లర్ వేసుకున్న డ్రెస్ తో ఆమె అందం మరింత పెరిగింది. ముత్యాలు,చంకీలు, రత్నాలు పొదిగిన డ్రెస్ లా ఉండే ఈ డ్రెస్ లో మానుషి చిల్లర్ తళుక్కున మెరిసింది.



## శశిరేఖగా నయనతార!



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా మూవీ మన శంకర వరప్రసాద్ గారు. స్టార్ హీరోయిన్ నయనతార ఫిమేల్ లీడ్ రోల్ లో యాక్ట్ చేస్తున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఆ మూవీ సంక్రాంతి కానుకగా విడుదల అవ్వనుంది. సినిమా నుంచి సెకెండ్ సింగిల్ శశిరేఖా... అంటూ సాగనున్న మెలోడీ పాటను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 8వ తేదీన సాంగ్ రిలీజ్ కానుండగా.. శనివారం సోషల్ మీడియాలో ప్రోమో విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఆ పాటను ప్రముఖ లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ రాశారు. దీన్ని స్టార్ ఫోక్ సింగర్ మధుప్రియ తో కలిసి భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన శశిరేఖ సాంగ్ ప్రోమో.. ఇప్పుడు మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. ప్రోమో చాలా బాగుందని నెటిజన్లు, సినీ ప్రియులు, మ్యూజిక్ లవర్స్ కామెంట్లు పెడుతున్నారు. పూర్తి పాట కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే మరో రెండు రోజుల్లో ఫుల్ సాంగ్ విడుదల అవుతుంది. మరి శశిరేఖ పాట.. ఎలా ఉంటుందో.. ఎంతలా ఆకట్టుకుంటుందో.. ఎన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.






సాగరతీర నగరం విశాఖపట్నంలో భారత్ విజయబావుట ఎగురవేసింది. స్వదేశంలో టెస్టు సిరీస్ ఓటమితో ఘోరమైన అపప్రదను మూటగట్టుకున్న టీమ్ఇండియా వన్డే సిరీస్ విజయంతో అభిమానులకు ఊరట కల్పించింది. గెలిస్తే గానీ పరువు నిలబెట్టుకోలేని పరిస్థితుల్లో బరిలోకి దిగిన భారత్ నిర్ణయాత్మక మూడో వన్డేలో దక్షిణాఫ్రికాపై భారీ విజయాన్నందుకుంది. కుల్దీప్‌యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు వికెట్ల విజృంభణతో సాధారణ స్కోరుకు పరిమితమైన సఫారీలు.. టీమ్ఇండియాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అజేయ సెంచరీకి తోడు దిగ్గజ ద్వయం రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ అర్ధసెంచరీలతో మరో పది ఓవర్లు ఉండగానే మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. సఫారీ బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ జైస్వాల్, రోహిత్, కోహ్లీ పరుగుల వరద పారించారు.

# చెలరేగిన జైస్వాల్

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుంది. వైజాగ్ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో సమష్టిగా రాణించిన టీమిండియా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. క్వింటన్ డికాక్(89 బంతుల్లో 6 ఫోర్లతో 106) సెంచరీతో చెలరేగగా.. టెంబా బవుమా(67 బంతుల్లో 5 ఫోర్లతో 48) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ నాలుగేసి వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు. అనంతరం భారత్ 44 ఓవర్లలో వికెట్ నష్టానికి పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. యశస్వి జైస్వాల్(116 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 107) సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 57), రోహిత్ శర్మ(73 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 75) హాఫ్ సెంచరీలతో రాణించారు. సౌతాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్ ఒక్కడే వికెట్ తీయగా మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. 271 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ అద్భుతంగా బ్యాటింగ్‌తో తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. క్రీజులో సెట్ అయ్యేందుకు కాస్త సమయం తీసుకున్న ఈ జోడీ ఆ తర్వాత తమదైన శైలిలో చెలరేగింది. ముఖ్యంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడిన జైస్వాల్.. ఆచితూచి ఆడాడు. దాంతో పవర్ ప్లేలో భారత్ వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది. అనంతరం రోహిత్ దూకుడు కనబర్చగా.. జైస్వాల్ తనదైన శైలిలో పరుగులు రాబట్టాడు. 54 బంతుల్లో రోహిత్ శర్మ హాఫ్ సెంచరీ సాధించగా.. యశస్వి జైస్వాల్ 75 బంతుల్లో అర్ధ శతకం అందుకున్నాడు. హాఫ్ సెంచరీ అనంతరం దూకుడుగా ఆడే క్రమంలో రోహిత్ శర్మ ఔటవ్వగా.. కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించాడు. జైస్వాల్ కూడా బ్యాట్‌కు పనిచెప్పడంతో స్కోర్ బోర్డు పరుగెత్తింది. ఈ క్రమంలో యశస్వి జైస్వాల్ 111 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు దూకుడుగా ఆడిన విరాట్ కోహ్లీ 40 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత పోటా పోటీగా పరుగులు రాబట్టిన ఈ జోడీ..61 బంతులు మిగిలి ఉండగానే విజయలాంఛనాన్ని పూర్తి చేసింది. కార్బిన్ బోష్ బౌలింగ్‌లో లాంగాన్ దిశగా విరాట్ కోహ్లీ కొట్టిన నో లుక్ సిక్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

## ఓటమి దిశగా ఇంగ్లండ్

రెండో టెస్టులో ఆధిపత్యం ఆసీస్‌దే!




ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ ఓటమి దిశగా సాగుతోంది. 177 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 6 వికెట్లకు 134 పరుగులు చేసింది. జాక్‌క్రాలీ(59 బంతుల్లో 6 ఫోర్లతో 44) ఒక్కడే రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీతో రాణించిన జోరూట్(15) తీవ్రంగా నిరాశపర్చాడు. క్రీజులో కెప్టెన్ బెన్ స్టోక్స్(4 బ్యాటింగ్)తో పాటు విల్ జాక్స్(4 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మైఖేల్ నేజర్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. ప్రస్తుతం ఆసీస్ 43 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 378/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోర్ చేసింది. మిచెల్ స్టార్క్(141 బంతుల్లో 13 ఫోర్లతో 77) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఒక్క బ్యాటర్ సెంచరీ చేయకుండానే.. ఆసీస్ 511 పరుగుల భారీ స్కోర్ చేయడం గమనార్హం. ఐదుగురు బ్యాటర్లు హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(4/152) నాలుగు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(3/113) మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, విల్ జాక్స్ తలో వికెట్ తీసారు. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓటమి తప్పించుకోలేదు.

## మూడేళ్ల తర్వాత మునపటిలా: విరాట్



స్వేచ్ఛగా ఆడటంతోనే తాను మునపటిలా రాణించగలిగానని టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తెలిపాడు. ఇప్పటికీ జట్టు విజయాల్లో భాగమవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో విరాట్ కోహ్లీ అసాధారణ బ్యాటింగ్‌తో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. మూడు వన్డేల్లో రెండు శతకాలు, అజేయ హాఫ్ సెంచరీతో 302 పరుగులు చేసిన కోహ్లీ టాప్ స్కోరర్‌గా భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైజాగ్ వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో సిరీస్‌తో 2-1తో కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచిన కోహ్లీ.. తన ఆటతీరు సంతృప్తినిచ్చిందని తెలిపాడు. గత 2-3 ఏళ్లలో ఇలా ఆడలేకపోయానని చెప్పుకొచ్చాడు. 'ఈ సిరీస్‌లో నేను ఆడిన తీరు సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం నా మనసు చాలా తేలికగా ఉంది. గత 2-3 ఏళ్లుగా నేను ఇలా ఆడలేదు. నేను ఇలా ఆడితే జట్టుకు బాగా ఉపయోగపడుతుందని నాకు తెలుసు.

## సిరాజ్.. నీ దావత్ అదుర్స్: షమీ

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ ఇచ్చిన దావత్ బాగుందని వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ అన్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా.. హైదరాబాద్‌కు వచ్చిన బెంగాల్ ఆటగాళ్లకు సిరాజ్ తన రెస్టారెంట్‌లో డిన్నర్ ఏర్పాటు చేశాడు. పుదుచ్చేరితో మ్యాచ్ కోసం బెంగాల్ టీమ్ హైదరాబాద్‌కు వచ్చింది. బెంగాల్ టీమ్‌లో



భాగంగా ఉన్న టీమిండియా ఆటగాళ్లు మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్‌తో పాటు ఇతర ఆటగాళ్లకు సిరాజ్ తన రెస్టారెంట్‌లో మంచి దావత్ ఇచ్చాడు. ఈ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్న మహమ్మద్ షమీ.. సిరాజ్ ఆతిథ్యం బాగుందని పేర్కొన్నాడు. 'మహమ్మద్ సిరాజ్.. నాతో పాటు బెంగాల్ టీమ్ ఆటగాళ్లను తన రెస్టారెంట్‌కు ఆహ్వానించాడు. ఇది మా స్నేహాన్ని బలోపేతం చేసుకోవడానికి అద్భుతమైన మార్గం. మేమంతా కలిసి చక్కటి భోజనాన్ని ఆస్వాదించాం. సరదాగా గడిపాం. మైదానంలో, బయట మంచి స్నేహబంధాన్ని ఏర్పర్చుకుంటాం. అద్భుతమైన ఆతిథ్యానికి ధన్యావాదాలు.'అని షమీ పేర్కొన్నాడు. హైదరాబాద్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లో సిరాజ్.. 'జొహార్ఫా'అనే రెస్టారెంట్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొఘలాయ్, పర్షియన్, అరేబియన్, చైనీస్ వంటకాలు ఈ రెస్టారెంట్ ప్రత్యేకం. గాయంతో టీమిండియాకు దూరమైన మహమ్మద్ షమీ.. పూర్తి ఫిట్‌నెస్ సాధించి దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్నాడు. కానీ సెలెక్టర్లు మాత్రం అతన్ని పట్టించుకోవడం లేదు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ 19.44 సగటుతో 9 వికెట్లు తీసాడు. మరోవైపు సిరాజ్ ఈ టోర్నీలో ఒకే ఒక్క మ్యాచ్ ఆడాడు. యూపీతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తరఫున బరిలోకి దిగి ఒక వికెట్ తీసాడు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 3 వికెట్ల తేడాతో గెలుపొందింది.

## రోహిత్ శర్మ మరో రికార్డు!

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో మరో మైలురాయిని అధిగమించాడు. ఇటీవలే వన్డేల్లో అత్యధిక సిక్సర్ల వీరుడిగా అవతరించిన హిట్‌మ్యాన్.. ఇప్పుడు అంతర్జాతీయంగా 20 వేల క్లబ్‌లో చేరాడు. వైజాగ్ వన్డేలో 26 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతడు ఈ మైలురాయిని అందుకున్నాడు. కేశవ్ మహరాజ్ ఓవర్లో సింగిల్ తీసిన రోహిత్.. మూడు ఫార్మాట్లలో కలిపి 20 వేల పరుగులు



సాధించాడు. మొత్తంగా ఈ ఘనతను సొంతం చేసుకున్న నాలుగో భారత క్రికెటర్‌గా ఈ మాజీ కెప్టెన్ రికార్డు నెలకొల్పాడు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న రోహిత్ శర్మ వరుస పెట్టి రికార్డులు బ్రేక్ చేస్తున్నాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో సిక్సర్ల కింగ్‌గా షాహిద్ అఫ్రిదిని దాటేసి చరిత్ర సృష్టించిన రోహిత్.. ఈసారి అంతర్జాతీయంగా 20 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.



## దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు గిల్

దక్షిణాఫ్రికాతో జరుగనున్న టీ20 సిరీస్‌లో టీమిండియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండనున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో మెడ గాయం కారణంగా టెస్ట్‌లతో పాటు వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహాబిలిటేషన్‌లో కెప్టెన్ తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. గిల్ అన్ని ఫార్మాట్లలో ఆడేందుకు పూర్తిగా సిద్ధమయ్యాడని వైద్యులు ప్రకటించారు. గిల్ పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చేందుకు అవసరమైన అన్ని ఫిట్‌నెస్, ప్రమాణాలను పూర్తి చేసినట్లు తెలిపారు. అతను కోలుకునే ప్రక్రియను వైద్యులు నిశితంగా పరిశీలించారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదించారు. శుభ్‌మన్ గిల్‌ను అధికారికంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి విడుదల చేయనున్నారు. డిసెంబర్ 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగనున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కిన విషయం తెలిసిందే. ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే టీ20 సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని సెలక్షన్ సమయంలో బీసీసీఐ స్పష్టం చేసింది. తాజాగా ఫిట్‌నెస్ సాధించడంతో ఇక టీ20 సిరీస్‌లో కనిపించనున్నాడు.

## ఏఎంబీ మాల్‌లో పాండ్యా సందడి

భారత స్టార్ ఆల్‌రౌండర్, స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా హైదరాబాద్‌లోని మహేశ్ బాబుకు చెందిన ఏఎంబీ సినిమాస్



మాల్‌ను సందర్శించి అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ విషయాన్ని ఏఎంబీ సినిమాస్ బృందం సోషల్ మీడియా వేదిక గా వెల్లడించింది. బంతిని స్టేడియం వెలుపలికి పంపడంలోనే కాకుండా, వినోదం కోసం సరైన స్థలాన్ని ఎంచుకోవడంలో కూడా హార్దిక్ పాండ్యా తన 'ఆల్-రౌండర్' ప్రతిభను చూపించాడని ఏఎంబీ సినిమాస్ తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కాగా ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. హార్దిక్ రణ్‌వీర్ సింగ్ నటించిన ధురంధర్ సినిమాను చూడటానికి థియేటర్‌కి వచ్చినట్లు తెలుస్తుంది. మరోవైపు హార్దిక్ పాండ్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుస్తుండగా.. అతడు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున ఆడటానికి వచ్చి ఉండవచ్చని సమాచారం.

## వరల్డ్ కప్ సెమీస్‌కు భారత్

భారత జూనియర్ హాకీ జట్టు చెన్నైలో జరుగుతున్న జూనియర్ హాకీ వరల్డ్ కప్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బెల్జియంను ఓడించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. భారత్ బెల్జియంపై ఉత్కంఠభరితమైన పెనాల్టీ షూటౌట్‌లో 4-3 తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టు 2016 చరిత్రను పునరావృతం చేయడానికి కేవలం రెండు అడుగుల దూరంలో నిలిచింది. అయితే సెమీఫైనల్లో భారత జట్టుకు గత ప్రపంచ కప్ విజేత జర్మనీ నుంచి గట్టి సవాలు ఎదురుకానుంది. భారత జట్టు ప్రస్తుత ఫామ్‌ను చూస్తే, జర్మనీని ఓడించడం అసాధ్యం కాదని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. భారత హాకీ జట్టు పూల్‌లో బలహీనమైన జట్లు ఉండటం వల్ల క్వార్టర్ ఫైనల్ వరకు సులభంగా చేరుకుంది. కానీ శుక్రవారం రాత్రి చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో తొలిసారి బలమైన జట్టును ఎదుర్కొంది. 13వ నిమిషంలోనే బెల్జియంకు చెందిన గాస్పర్డ్ కార్నెజ్-మాసెంట్ గోల్ చేసి ఆధిక్యంలోకి తీసుకువచ్చారు (0-1). తొలి అర్ధభాగంలో భారత్ 7 సార్లు సర్కిల్‌లోకి చొచ్చుకెళ్లినా.. రెండు పెనాల్టీ కార్నర్‌లను దక్కించుకున్నా గోల్ చేయలేకపోయింది. రెండో అర్ధభాగంలో టీమ్ మెంటార్ పి.ఆర్. శ్రీజేష్ వ్యూహాన్ని మార్చడంతో మూడో క్వార్టర్ ప్రారంభానికి 17 సెకన్ల ముందు భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. దీనిని కెప్టెన్ రోహిత్ డ్రాగ్ ఫ్లిక్ ద్వారా గోల్‌గా మలచి స్కోరును 1-1తో సమం చేశాడు. 48వ నిమిషంలో వచ్చిన మరో పెనాల్టీ కార్నర్‌ను శారద నంద్ తివారీ పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ చేసి భారత్‌ను 2-1తో ఆధిక్యంలోకి తీసుకువచ్చాడు.



ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 7-12-2025 | www.evarthalu.com



# వీరులకు విరాళాలిద్దాం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో రక్షణ సిబ్బంది సంక్షేమం కోసం నిధుల కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించడానికి, 1949లో రక్షణ మంత్రి ఆధ్వర్యంలో ఒక కమిటీ డిసెంబర్ 7వ తేదీని 'పతాక దినోత్సవం'గా జరుపుకోవాలని నిర్ణయించింది. అప్పటి నుంచి, ఈ రోజున చిన్న రంగురంగుల జెండాలను (ఎరుపు, ముదురు నీలం మరియు లేత నీలం రంగులలో) విక్రయించడం ద్వారా ప్రజల నుంచి స్వచ్ఛంద విరాళాలు సేకరించడం ఆనవాయితీగా మారింది. ఈ రోజు ప్రధాన లక్ష్యం.. సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి మద్దతు ఇవ్వడానికి ప్రజలలో అవగాహన కల్పించడం, నిధులు సేకరించడం. దేశ సార్వభౌమత్వాన్ని, సరిహద్దులను కాపాడటంలో భారత త్రివిధ దళాలు చేస్తున్న అహర్నిశల కృషి, శత్రువుల నుంచి దేశాన్ని రక్షిస్తూ వారు చేసిన త్యాగాలను స్మరించుకోవడానికి ఈ దినోత్సవం ఒక ప్రత్యేక సందర్భం.

మనం ఇచ్చే విరాళాలు సాయుధ దళాల పతాక దినోత్సవ నిధిలో జమ అవుతాయి. వీటిని అమరవీరుల కుటుంబాలకు, గాయపడిన సైనికులు, మాజీ సైనికుల పునరావాస కార్యక్రమాలకు ఉపయోగిస్తారు. తద్వారా, దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన వారి కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని తెలియజేయటం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. దేశ సరిహద్దులను మాత్రమే కాకుండా, దేశంలోని అంతర్గత భద్రతను కాపాడటంలోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయ పునరావాస కార్యక్రమాలలోనూ భారత సాయుధ దళాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎముకలు కొరికే చలిలో, భగ్గుమనే ఎండల్లో, కుండపోత వర్షాల్లో ఏమాత్రం వెనుకాడకుండా దేశాన్ని రక్షించే సైనికుల దేశభక్తి, ఆత్మస్థైర్యం వెలకట్టలేనివి. 1947, 1965, 1971 నాటి భారత-పాక్ యుద్ధాలు, 1962 భారత-చైనా యుద్ధం, కార్గిల్ యుద్ధం వంటి అనేక సంఘర్షణలలో భారత బలగాలు తమ శౌర్య ప్రతాపాలను ప్రదర్శించాయి. వేలాది మంది సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేసి దేశ గౌరవాన్ని కాపాడారు. వరదలు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడినప్పుడు, త్రివిధ దళాలు తక్షణమే స్పందించి, వేలాది మంది ప్రాణాలను కాపాడి, సహాయక చర్యలు చేపడతాయి. అందుకే.. సాయుధ దళాల పతాక దినోత్సవం కేవలం ఒక రోజు పాటించే తంతుగా కాకుండా, అది దేశ పౌరులుగా మన బాధ్యతను గుర్తుచేసే రోజు. మన శాంతియుత జీవితానికి, దేశ భద్రతకు మూలమైన సైనికుల సంక్షేమానికి మన వంతు సహకారం అందించాలి. విరాళాలు ఇవ్వడం ద్వారా, మాజీ సైనికులు, వారి కుటుంబాలను గౌరవించడం ద్వారా మనం వారికి సంఘీభావం తెలియజేయవచ్చు. ప్రతి పౌరుడు తమ విద్యార్థి దశ నుండే దేశభక్తి, సేవాభావం అలవర్చుకోవాలి. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా, మన ధీర సైనికుల పరాక్రమానికి, త్యాగాలకు వందనం సమర్పిద్దాం, వారి కుటుంబాలకు అండగా నిలుద్దాం.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**

---

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి (డిసెంబర్ 7) రెండేళ్లు పూర్తవుతోంది. 'ప్రజాపాలన-ప్రజలతోనే' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ప్రజల్లో భారీ అంచనాలు ఉండేవి. అయితే, ఈ రెండేళ్లలో ప్రభుత్వం చెప్పుకోదగ్గ నిర్ణయాలు తీసుకోలేదని, పైగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ప్రభుత్వం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. రేవంత్ రెడ్డి స్వయంగా రాష్ట్రం దివాళా తీసే స్థితికి చేరుకుందని, ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులకే అధిక మొత్తం ఖర్చవుతోందని పలుమార్లు అసెంబ్లీలోనూ బయట కూడా పేర్కొన్నారు.

# ఏం ఒరిగింది తెలంగాణకు?



రాష్ట్ర నెలవారీ ఆదాయం సుమారు రూ.18,500 కోట్లు కాగా, కనీస అవసరాలకు రూ.22,500 కోట్లు అవసరమవుతున్నాయి, దీంతో ప్రతి నెల రూ.4,000 కోట్ల లోటు ఏర్పడుతోంది. రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు రావడం తగ్గింది. ఉన్న కొన్ని కంపెనీలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ఇది ఉద్యోగ కల్పనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రజల్లో ఆశలు రేకెత్తించినప్పటికీ, వాటి అమలు నత్తనడకన సాగుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పాక్షికంగా అమలైనా, ముఖ్యమైన పంట రుణమాఫీ వంటి హామీలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ప్రభుత్వం 60,000 ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతున్నప్పటికీ, నిరుద్యోగులు ఇంకా ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో వసౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కూడా మందగించాయి. కొత్త ప్రాజెక్టులు చేపట్టడం మాట అటుంచి, పాత ప్రాజెక్టుల నిర్వహణ కూడా సరిగా జరగడం లేదు. మొత్తంగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సవాళ్లను, తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో, ప్రభుత్వం చెప్పుకోదగ్గ నిర్ణయాలేవీ తీసుకోలేకపోతోంది. రేవంత్ రెడ్డి పాలనపై ఇంకా పట్టు సాధించలేదన్నది అక్షర సత్యం. ఆర్థిక క్రమశిక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి. కానీ, ఆ పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదు. రాష్ట్ర పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం కనిపిస్తోంది.



**నవీన్ పోగుల**
తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం ప్రధాన కార్యదర్శి

---

# ఇండిగో.. మేల్కొలుపు!



భారతదేశపు అతిపెద్ద విమానయాన సంస్థ 'ఇండిగో' ఇటీవల ఎదుర్కొన్న సంక్షోభం భారత పౌర విమానయాన రంగంలో అంతర్గత లోపాలను, నియంత్రణ వైఫల్యాలను కళ్ళకు కట్టినట్లు చూపింది. వందల విమానాల రద్దు, లక్షల మంది ప్రయాణికుల ఇబ్బందులు, ఆకాశాన్నంటిన విమాన టిక్కెట్ల ధరలు.. ఇవన్నీ ఒక విమానయాన సంస్థ సమస్యగా కాకుండా, మొత్తం వ్యవస్థను పునరాలోచించేలా చేశాయి.

ఈ సంక్షోభానికి గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నవంబర్ 1 నుండి అమలులోకి తెచ్చిన కొత్త 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్' నిబంధనలు. పైలట్లు, క్యాబిన్ సిబ్బందికి తగిన విశ్రాంతిని కల్పించడం ద్వారా భద్రతను పెంచాలనే సదుద్దేశంతో ఈ నిబంధనలు రూపొందించారు.



ఇండిగో సంస్థ ఈ మార్పులకు అనుగుణంగా తన కార్యకలాపాలను, సిబ్బంది రోస్టరింగ్‌ను (పనివేళల ప్రణాళిక) సకాలంలో పునర్వ్యవస్థీకరించడంలో విఫలమైంది. దాంతో.. కొత్త నిబంధనల ప్రకారం ఎక్కువ మంది సిబ్బందికి ఒకేసారి తప్పనిసరి విశ్రాంతి అవసరమైంది. అయితే, ఇండిగో ముందుచూపు లేకుండా తగినంత మంది కొత్త పైలట్లను నియమించుకోలేదు.

శీతాకాలపు షెడ్యూల్ మార్పులు, సాంకేతిక లోపాలు, వాతావరణ పరిస్థితులు వంటి ఇతర అంశాలు తోడై 'డొమినో ఎఫెక్ట్'ను సృష్టించాయి. దీనివల్ల వందలాది విమానాలు రద్దయ్యాయి. ఇతర విమానయాన సంస్థలు (ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్) కొత్త నిబంధనలకు ముందే సన్నద్ధం కాగా, ఇండిగో మాత్రం నిబంధనలను పట్టించుకోకుండా తన నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటూ పోయింది. ఈ సంక్షోభం కారణంగా వేల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ముఖ్యంగా టిక్కెట్ల ధరలు నాలుగు రెట్లు పెరిగాయి, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడం సామాన్యులకు భారంగా మారింది. ఇండిగో సంక్షోభం కేవలం ఒక సంస్థాగత వైఫల్యం కాదు, మొత్తం దేశ విమానయాన భద్రత, ప్రయాణికుల హక్కులకు సంబంధించిన అంశం. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలి. డీజీసీఏకు మరింత స్వయంప్రతిపత్తి, కఠినమైన పర్యవేక్షణ అధికారాలు కల్పించాలి. విమానయాన సంస్థలు భద్రతా నిబంధనలను, ఎఫ్‌డీటీఎల్ వంటి కార్యాచరణ ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలి. కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చే ముందు, విమానయాన సంస్థలు తమ సన్నద్ధత ప్రణాళికలను డీజీసీఏకు సమర్పించి, ఆమోదం పొందేలా నిబంధన తేవాలి. తగినంత సిబ్బంది నియామకం, శిక్షణ ప్రక్రియలను ముందస్తుగానే పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకురావాలి. సంక్షోభ సమయాల్లో ప్రయాణికులను దోచుకోవడం నివారించడానికి, అత్యవసర పరిస్థితుల్లో విమాన టిక్కెట్ల ధరలపై పరిమితులు విధించే యంత్రాంగాన్ని శాశ్వతంగా అమలు చేయాలి. విమానాలు రద్దు లేదా ఆలస్యమైనప్పుడు ప్రయాణికులకు సకాలంలో పూర్తి వాపసు, వసతి, ప్రత్యామ్నాయ విమాన ఏర్పాట్లు అందించేలా కఠినమైన చట్టాలు అమలు చేయాలి. వీటిని ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించాలి. దేశీయ విమానయాన రంగంలో ఒకటి లేదా రెండు సంస్థలపైనే (ఇండిగో, ఎయిర్ ఇండియా వంటివి) అధికంగా ఆధారపడటం మొత్తం వ్యవస్థకు ప్రమాదకరం.

**ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించాలి, ఏకఛత్రాధిపత్య పోకడలను నిరోధించాలి. ఇండిగో సంక్షోభం దేశ విమానయాన రంగానికి ఒక మేల్కొలుపు.**

తక్షణ ఉపశమన చర్యగా కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను సడలించినప్పటికీ, దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం. కేవలం వాపసులిప్పించడం, విచారణ కమిటీలు వేయడం కాకుండా, పటిష్టమైన విధాన సంస్కరణలు చేపట్టాలి. అప్పుడే, భారత పౌర విమానయాన రంగం సురక్షితమైన, స్థిరమైన భవిష్యత్తును కలిగి ఉంటుంది. ప్రయాణికుల భద్రత, సౌకర్యం ఎప్పుడూ ప్రాధాన్య అంశాలుగా ఉండాలి.



**శశిధర్ అక్కెల**

---

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.